Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి: 16 సంచిక:245 | విజయవాడ, 16-6-2026, మంగళవారం | పేజీలు: 8 | వెల: 1.00

## ప్రతి ఒక్కరికి అందుతున్న సంక్షేమ పథకాలు...భాను ప్రకాష్ రెడ్డి

తిరుపతి గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో దేశవ్యాప్తంగా అనేక స్కాములు చోటుచేసుకున్నాయని, అయితే గత పుష్కరకాలంగా ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం స్కాముల స్థానంలో సంక్షేమ స్కీములతో దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తోందని బీజేపీ నాయకులు భాను ప్రకాష్ రెడ్డి అన్నారు. తిరుపతి ప్రెస్ క్లబ్లో మీడియాతో మాట్లాడిన ఆయన, మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి పేద కుటుంబానికి చేరుతున్నాయని తెలిపారు. అవినీతి రహిత పాలనతో భారతదేశం ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్నారు.

# సింగపూర్ పర్యటన.. ప్రముఖ సంస్థల ప్రతినిధులతో సీఎం చంద్రబాబు వరుస సమావేశాలు




సింగపూర్/అమరావతి, జూన్ 15: సింగపూర్ పర్యటనలో భాగంగా వివిధ ప్రముఖ సంస్థల ప్రతినిధులతో సీఎం చంద్రబాబు వరుసగా సమావేశాలు నిర్వహించారు. ఏపీలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను ఆయా సంస్థల ప్రతినిధులకు సీఎం వివరించారు. తొలిరోజు పర్యటనలో భాగంగా వైసీహెచ్(జఎ) లాజిస్టిక్స్ గ్రూప్ హెడ్ ఆఫ్ ఆపరేషన్స్ సునీల్ నంబియార్‌తో చంద్రబాబు భేటీ అయ్యారు. సప్లై చైన్, లాజిస్టిక్స్ పార్కుల ఏర్పాటుపై జఎ గ్రూప్‌తో చర్చలు జరిపారు. ఆటోమేటెడ్, అత్యాధునిక సాంకేతికతతో కూడిన భారీ సప్లై చైన్ సిటీని ఏపీలో నిర్మించే అంశంపై చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ... ఏపీకి 1,000 కి.మీ సుదీర్ఘ సముద్ర తీరం ఉందని.. లాజిస్టిక్స్ పరంగా అనేక అనుకూలతలు ఉన్నాయని తెలిపారు.

హైవేలు, పోర్టులు, ఎయిర్ పోర్టులు, రైల్వే కనెక్టివిటీ ఉందని సీఎం చెప్పారు. లాజిస్టిక్స్ వ్యయం తగ్గించేందుకు ప్రణాళికతో పనిచేస్తున్నామన్నారు. హార్టికల్చర్‌పై లక్ష కోట్లు ఇన్వెస్ట్ చేయబోతున్నామని.. ఆక్వాకల్చర్‌లో నంబర్‌వన్‌గా ఉన్నామని వివరించారు. ఆహార ఉత్పత్తులకు వాల్యూఎడిషన్ ద్వారా ఎగుమతులకు ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. ఏపీలో అపార అవకాశాలున్నాయని... ప్రొడక్షన్‌లో కూడా పెట్టుబడులు పెట్టవచ్చన్నారు. 'ఏపీని సందర్శించండి... రాష్ట్రంలో ఉన్న పాలసీలు, అనుకూలతలు చూసి పెట్టుబడులు పెట్టండి' అంటూ సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు.

గూగుల్ క్లౌడ్ ఆసియా-పసిఫిక్ రీజియన్ అధ్యక్షుడు కరణ్ బజ్వాతో సీఎం చంద్రబాబు భేటీ అయ్యారు. ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అతిపెద్ద ఏఐ, డేటా సెంటర్, డిజిటల్ మౌలిక సదుపాయాల కేంద్రంగా తీర్చిదిద్దే అంశాలపై ఇరువురి మధ్య చర్చకు వచ్చింది. ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్, డిజిటల్ గవర్నెన్స్ రంగాల్లో గూగుల్ భాగస్వామ్యాన్ని మరింత విస్తరించేందుకు ప్రత్యేకంగా టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్రభుత్వ సేవల్లో ఏఐ వినియోగంపై గూగుల్ క్లౌడ్ సహకారాన్ని సీఎం కోరారు.

రియల్ టైమ్ గవర్నెన్స్ వ్యవస్థను మరింత శక్తిమంతం చేసేందుకు ఆధునిక క్లౌడ్ సాంకేతికతల వినియోగంపై చర్చించారు. ఏఐ, మెషిన్ లెర్నింగ్, క్లౌడ్ టెక్నాలజీలలో యువతకు భారీ స్థాయిలో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని ప్రతిపాదించారు. గూగుల్ క్లౌడ్‌తో కలిసి ఏఐ స్కిల్లింగ్, క్లౌడ్ సర్టిఫికేషన్ కార్యక్రమాలను విస్తరించాలని భావిస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. విశ్వవిద్యాలయాలు, ఇంజినీరింగ్ కళాశాలల్లో ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్ కేంద్రాల ఏర్పాటుపై చర్చించారు. గ్రీన్ ఎనర్జీ రంగంలో రాష్ట్ర ప్రభుత్వ విజయాలను వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోన్న సంజీవని ప్రాజెక్టులో భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోరారు.

# పార్టీ కంటే దేశ సమగ్రతకే ప్రాధాన్యం: పవన్ కల్యాణ్

దిల్లీ: జనసేన ప్రారంభించినప్పుడు దేశ సమగ్రత, శ్రేయస్సు తప్ప.. తనకు ఏ ఆలోచనా లేదని ఆ పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ అన్నారు. పార్టీ స్థాపించినప్పుడు అధికారం వస్తుందో, రాదో కూడా తెలియదన్నారు. 'జాతీయ సమగ్రత కోసం సేన ప్రస్థానం' పేరిట దిల్లీలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ.. పార్టీ స్థాపించి 12 ఏళ్లు పూర్తయిందని, ఈ ప్రయాణంలో చాలా పోరాటాలు చేశామని, పరాజయాలు ఎదుర్కొన్నామని చెప్పారు.



"మారుతున్న సామాజిక, రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా 7 ప్రాథమిక సూత్రాలను వదల్లేదు. నిర్దిష్ట ఆచరణాత్మక విధానంతో 21 ఎమ్మెల్యే స్థానాలు, 3 ఎంపీ స్థానాలను సాధించాం. లక్ష మంది సభ్యత్వంతో ప్రారంభమైన పార్టీకి.. 20 లక్షలకుపైగా సభ్యత్వాలు వచ్చాయి. ఇటీవల కాలంలో అన్ని ప్రాంతాల నుంచి వేల మంది పార్టీలో చేరుతున్నారు. పార్టీ ప్రయోజనాల కంటే.. దేశ సమగ్రతకు తొలి ప్రాధాన్యం ఇస్తున్నాం. దేశ స్ఫూర్తిని కాపాడుకోవడం ఒక రోజుతో అయ్యే పని కాదు. దేశ స్ఫూర్తిని ప్రతితరం ముందుకు తీసుకెళ్లాలి.

తెలంగాణ ఏర్పాటుకు ఏనాడూ జనసేన అడ్డు చెప్పలేదు. 2014లో ఏపీని విభజించిన తీరును చూసి మాత్రమే ఆవేదన వ్యక్తం చేశాం. విభజన విషయంలో కాంగ్రెస్ వ్యవహరించిన తీరు.. అసంతృప్తిని, అశాంతిని సృష్టించింది. అప్పటి నుంచి ఇప్పటికీ వారి ధోరణి మారలేదు. జనసేన సభకు అనుమతివ్వకుండా అడ్డుకోవడమే అందుకు ఉదాహరణ. దిల్లీ మెడలు వంచుతాం.. తడాఖా చూపిస్తామంటూ చాలామంది పెద్దలు మాటలు చెబుతారు. వాస్తవానికి అలాంటి నేతలు దిల్లీకి రాగానే వెనక్కి తగ్గుతారు. చాలాసార్లు మనకు మనం తక్కువగా అంచనా వేసుకుంటాం. ప్రతి వ్యక్తి కూడా సమాజంలో మార్పు తీసుకురావొచ్చు. ఈ మధ్య కాక్రోచ్ పార్టీ ఎలా పుట్టుకొచ్చిందో చూస్తున్నాం. కాక్రోచ్ పార్టీని చూస్తే.. చలిచీమల పద్యం గుర్తుకొచ్చింది. చలిచీమలు కూడా బలమైన పామును చంపేస్తాయి" అని పవన్ అన్నారు.



## పర్యాటకుల భద్రతకు చర్యలు.. పాపికొండల బోట్లలో విస్తృత తనిఖీలు

దేవీపట్నం: పాపికొండలు పర్యాటకుల భద్రత కోసం ఏపీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పర్యాటక బోట్లను అధికారులు విస్తృతంగా తనిఖీ చేస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గోదావరిలో తిరిగే బోట్ల భద్రతా ప్రమాణాలను పరిశీలిస్తున్నారు. ఇవాళ్టి నుంచి పాపికొండలు విహారయాత్రను తాత్కాలికంగా నిలిపివేసిన సంగతి తెలిసిందే.

ఈ నేపథ్యంలో దేవీపట్నం మండలం గండి పోచమ్మ ఆలయం వద్ద ఇటీవల సాంకేతిక కారణాలతో నిలిచిపోయిన బోట్లను ఆర్డీవో స్వాతి తనిఖీ చేశారు. పర్యాటకులతో బయల్దేరిన బోటు మధ్యలో నిలిచిపోవడంపై ఆరా తీశారు. గండి పోచమ్మ బోటింగ్ పాయింట్ వద్ద సౌకర్యాలను ఆర్డీవో పరిశీలించారు. బోటు యజమానులు, పర్యాటక శాఖ అధికారులతో ఆర్డీవో సమావేశమయ్యారు. అన్నిబోట్ల ఫిట్‌నెస్‌ను తనిఖీ చేసి సరిగా ఉన్నాకే నదిలో విహారానికి అనుమతివ్వాలని ఆదేశించారు. ప్రతి బోటుకూ ఫిట్‌నెస్ ధ్రువపత్రం తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

# జగన్ హయాంలో నీటి ప్రాజెక్టులు దెబ్బతిన్నాయి.. మంత్రి నిమ్మల ధ్వజం

కర్నూలు, జూన్ 15 వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ( తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ హయాంలోని ఐదేళ్లలో ప్రాజెక్టుల పనులను నిర్లక్ష్యంగా వదిలేశారని ధ్వజమెత్తారు. వైసీపీ సర్కార్ అలసత్వంతో నీటి ప్రాజెక్టులు దెబ్బతిన్నాయని ఆగ్రహించారు. ఈరోజు (సోమవారం) కర్నూలు ఎంపీ, జిల్లా కూటమి పార్టీల ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల




ఇన్‌చార్జ్‌లు, ఇరిగేషన్ అధికారులతో మంత్రి నిమ్మల రామానాయుడు సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల మాట్లాడారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు సాగునీరు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని వ్యాఖ్యానించారు. మొదటి ఏడాదిలోనే హంద్రీనీవా కాలువ పనులు పూర్తి చేసి, 248 రోజుల్లో 52 టీఎంసీలు తరలించి, రాయలసీమ జిల్లాల్లో రిజర్వాయర్లు, చెరువులను నింపామని పేర్కొన్నారు. నేటికీ రిజర్వాయర్లు, చెరువులు నిండుకుండలా ఉన్నాయంటే చంద్రబాబు వాటర్ మేనేజ్‌మెంట్ వల్లనే సాధ్యమైందని ఉద్ఘాటించారు.

కర్నూలు పశ్చిమ ప్రాంతం సాగు, తాగునీరుపై ప్రత్యేక శ్రద్ధపెట్టాలని సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ సూచించారని మంత్రి నిమ్మల తెలిపారు. కీలకమైన గుండ్రేవుల, ఆర్డీఎస్ రైట్ కెనాల్, గాజుల దిన్నె, వేదవతి, గురురాఘవేంద్ర ప్రాజెక్టులు పూర్తి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఉద్ఘాటించారు. హంద్రీనీవా సుజల స్రవంతి పథకం నీటి ద్వారా 68 చెరువులు నింపేందుకు ఇప్పటికే రూ.228 కోట్లు ఖర్చు చేసి, 98 శాతం పనులు పూర్తి చేసి 67 చెరువులకు నీరందించామని తెలిపారు. జిల్లాలో 68 ట్యాంకుల పథకంలో భాగమైన జొన్నగిరి ట్యాంకుకు పైప్‌లైన్ నిర్మాణంపై అంచనాలు రూపొందిస్తున్నామని వివరించారు. గాజుల దిన్నె ప్రాజెక్టుకు భూసేకరణ, గేట్ల అమరిక, పెంచిన ఒక టీఎంసీ నీటి నిల్వకు అనుగుణంగా వేగంగా పనులు పూర్తి చేస్తామని వెల్లడించారు. 36 ప్రాధాన్యం గల ప్రాజెక్టుల్లో వేదవతి లిఫ్ట్ స్కీంను 2028 నాటికి పూర్తి చేసేలా ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించామని పేర్కొన్నారు.

ఆ బాధ్యతను వ్యాప్కోస్ సంస్థకు అప్పగించాం

వేదవతి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం డీపీఆర్, అటవీ, పర్యావరణ అనుమతులు పొందే బాధ్యతను వ్యాప్కోస్ సంస్థకు అప్పగించామని మంత్రి నిమ్మల తెలిపారు. ఆలూరు నియోజకవర్గంలోని నగరడోన రిజర్వాయర్‌లో ఆగిన పనులను మళ్లీ చేపట్టేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని వివరించారు. గుండ్రేవుల, ఆర్డీఎస్ ప్రాజెక్టులకు సంబంధించి అంతర్రాష్ట్ర సమస్యలు పరిష్కరించేలా సంప్రదింపులు చేపట్టాలని నిర్ణయించామని అన్నారు. గురు రాఘవేంద్ర ప్రాజెక్టుకు సంబంధించి ప్రత్యేక మరమ్మతుల కోసం ప్రణాళిక రూపొందించి, ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాలకు సాగు, తాగు నీరందించేలా చర్యలు చేపడుతున్నామని స్పష్టం చేశారు.

మోటార్లు దొంగలించినా పట్టించుకోలేదు..

జగన్ హయాంలో గురు రాఘవేంద్ర లిఫ్ట్ స్కీమ్‌లో మోటార్లు దొంగలించినా పట్టించుకోలేదని మంత్రి నిమ్మల ధ్వజమెత్తారు. గోరకల్లు రిజర్వాయర్‌కు మరమ్మతులు చేయాలని నిపుణులు చెప్పినా వినకుండా జగన్ హయాంలో పనులను ప్రీ క్లోజర్ చేసిందని ఆగ్రహించారు. శ్రీశైలం ప్లంజ్ పూల్ మరమ్మతులకు గొడ్డలి పార్టీ ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని మండిపడ్డారు.

# తెలంగాణలో భారీ వర్షాలు.. అధికారులకు మంత్రి కీలక ఆదేశాలు



హైదరాబాద్, జూన్ 15: తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా జూన్ 19వ తేదీ నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో సోమవారం హైదరాబాద్‌లో అన్ని జిల్లాల ఉన్నతాధికారులతో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి మంత్రి కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఉన్నతాధికారులను అప్రమత్తం చేశారు. వాతావరణ శాఖ హెచ్చరికలపై నిరంతర నిఘా అవసరమని వారికి స్పష్టం చేశారు.

విపత్తుల నిర్వహణ యంత్రాంగం పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండాలని మంత్రి చెప్పారు. జిల్లా కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్షాల తీవ్రత పెరిగే ప్రాంతాలను ముందుగానే గుర్తించాలని ఉన్నతాధికారులకు తెలిపారు. ప్రజల ప్రాణాలతోపాటు వారి ఆస్తుల రక్షణే ప్రభుత్వ లక్ష్యమన్నారు. వర్షాకాలం ముగిసే వరకు అప్రమత్తంగా ఉండాలని అధికారులకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.

# టార్గెట్ టూ థర్డ్....

2024 ఎన్నికల తరువాత మోదీ ప్రభుత్వం ఇతర పార్టీలపై ఆధారపడాల్సి వచ్చింది. కానీ, గత రెండేళ్లుగా తన బలాన్ని పెంచుకోవడానికి బీజేపీ చాలా చాలా ప్రయత్నాలు చేస్తున్నది. దీర్ఘకాలంగా తమతో ప్రయాణం చేస్తున్న కొన్ని పార్టీలు, పరిస్థితులను బట్టి మారే మరికొన్ని మిత్ర పక్షాలు, రాజకీయ అవసరాలు, అంశాలవారీగా మద్దతిచ్చే పక్షాలకు దగ్గరయ్యేందుకు బీజేపీ ప్రయత్నాలు చేస్తున్నది. లోక్‌సభలో ప్రస్తుతం బీజేపీకి 240 సీట్లు ఉన్నాయి.ఎన్డీయే మిత్రపక్షాలను కలిపినా 293 సీట్లతో సాధారణ మెజారిటీ మాత్రమే ఉన్నది. మూడింట రెండొంతుల మెజారిటీ కావాలంటే 362 సీట్లు అవసరం. మూడింట రెండొంతుల మెజారిటీ లేకపోతే ఏమవుతుందో డీలిమిటేషన్ బిల్లు, మహిళా రిజర్వేషన్ బిల్లు విషయంలో బీజేపీకి అనుభవంలోకి వచ్చింది. దీంతో వివిధ పార్టీలకు దగ్గరయ్యేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టింది. ఇందులో భాగంగానే 20 మంది టీఎంసీ ఎంపీలు లక్ష్యంగా ఆపరేషన్ లోటస్‌కు తెరదీసినట్టు తెలుస్తున్నది.వీరితో పాటు శిరోమణి అకాలీదళ్ కూడా బీజేపీతో జతకట్టే అవకాశం ఉంది. ఎందుకంటే, త్వరలో జరగనున్న పంజాబ్ ఎన్నికల్లో అకాలీదళ్‌తో బీజేపీ పొత్తు పెట్టుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. అదే జరిగితే, ఈ రెండు పార్టీల సభ్యులను కలుపుకొని ఎన్డీయే బలం 318కి చేరుతుంది. ఇక తమిళనాడులో డీఎంకేను తోసిరాజని టీవీకేతో కాంగ్రెస్ జతకట్టింది. డీఎంకే గతంలోనూ ఎన్డీయేతో కలిసి పనిచేసింది.ఇటీవల ఇండీ కూటమి సమావేశానికి కూడా డీఎంకే దుమ్మా కొట్టింది. ఈ క్రమంలో డీఎంకేను బీజేపీ సంప్రదించవచ్చు. ఇక వైఎస్సార్సీపీ. టీడీపీతో ఆ పార్టీకి రాజకీయ శత్రుత్వం ఎట్లా ఉన్నప్ప టికీ, మొదటినుంచీ బీజేపీతో సత్సం బంధాలు కొనసాగుతూనే ఉన్నా యి. ఝార్ఖండ్ ముక్తి మోర్చా ఇటీ వలి కాలంలో బీజేపీకి అనుకూ లంగానే మాట్లాడుతున్నది. ఎన్నిక ల్లో ఓటమి తరువాతి పరిణామాల క్రమంలో బీజేడీ నేత నవీన్ పట్నాయక్ మళ్లీ బీజేపీ వైపు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. బీఆర్ఎస్ మొదటి నుంచి కూడా కీలకమైన బిల్లుల విషయంలో మాత్రం బీజేపీ ప్రభుత్వానికి మద్దతు ఇస్తూ వస్తున్నది. ఇప్పుడు కూడా అదే వైఖరి కొనసాగించవచ్చు.ఇక శరద్ పవార్‌కు బీజేపీతో మంచి సంబంధాలే ఉన్నాయి. ప్రస్తుతానికి ఇండీ కూటమితో కలిసి ఉన్నప్పటికీ, కూతురు సుప్రియ రాజకీయ భవిష్యత్తు దృష్టిలో పెట్టుకోవాల్సి ఉంది. పవార్‌ను బీజేపీ సంప్రదిస్తే, ఆ పార్టీకి ఉన్న 8 మంది బలం ఎన్డీయేకు చేకూరుతుంది. కాకపోతే, టీఎంసీతో పాటు, ఎన్సీపీని విలీనం చేయాలని సోనియాగాంధీ ఇప్పటికే ఆఫర్ ఇచ్చినట్టు సమాచారం. ఇందుకు ఆ పార్టీలు ఏ మేరకు అంగీకరిస్తాయనేది చూడాలి. శరద్ పవార్‌తో పాటు డీఎంకేను తనకు అనుకూలంగా మార్చుకోగలిగితే.. బయటి నుంచి కూడా ముఖ్య బిల్లుల విషయంలోనైనా మద్దతు ఇచ్చే పార్టీల బలాన్ని కలుపుకొంటే మోదీ ప్రభుత్వ బలం దాదాపు 355కి చేరుకుంటుంది. మూడింట రెండొంతుల మెజారిటీకి ఇంకా ఏడుగురు తక్కువవుతారు. ఇక రాజ్యసభలో మూడింట రెండొంతుల మెజారిటీ అంటే 163. బీజేపీ సొంత బలం 113, మిత్రపక్షాలను కలుపుకొంటే ఈ సంఖ్య 144కి చేరుతుంది. పది మంది టీఎంసీ సభ్యులను కలిపితే 154కి చేరుకుంటుంది. బీజేపీకి మద్దతుగా వైఎస్సార్సీపీ 7, బీజేడీ 5, ముగ్గురు ఇండిపెండెంట్లను కలిపితే 169 అవుతుంది. దీంతో రాజ్యసభలో ఎన్డీయేకు పూర్తి మెజారిటీ వచ్చినట్టే. ఇప్పుడు జరుగుతున్న ఎన్నికలతో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.ముఖ్యమైన బిల్లులను పాస్ చేయించు కోవ డానికి ఈ సంఖ్య చాలా కీలకమవు తుంది. ఉమ్మడి పౌరస్మృతి, డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్లు, ఒకే దేశం, ఒకే ఓటు వంటి బిల్లులను ఆమోదించుకోవడానికి బీజేపీకి ఇప్పుడు నంబర్ అవసరమవుతుంది. ము ఖ్యంగా లోక్‌సభలో మెజారిటీ కోసం బీజేపీ పెద్దలు చాలా జాగ్రత్తగా పావులు కదుపు తున్నారు.మరో వైపు ఈసీ కూడా భారత ఎన్నికల సంఘం కేంద్ర పాలకపక్షానికి అనుకూలంగా వ్యవహరిస్తూ, గత 12 ఏళ్లుగా ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి జేబుసంస్థగా మారిందనే ఆరోపణలు, విమర్శలు అనేకం. స్వతం త్ర ప్రతిపత్తి గల ఈ రాజ్యాంగ సంస్థ పక్షపాతంతో అధికారంలో ఉన్న బీజేపీకి వంతపాడుతున్నదని ప్రజాసం ఘాలు, ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్నాయి. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) పేరిట ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో అధికార పార్టీకి అనుకూలంగా లక్షల ఓట్లు తొలగించి విపక్షాల ఓటమికి కారణమైందనే ఆరోపణలు ఈ మధ్యకాలంలో మిన్నంటుతున్నాయి.సుప్రీంకోర్టు మార్గదర్శకాలను పక్కనపెట్టి, ఎలక్షన్ల కమిషనర్లను ఎంపిక చేసే కమిటీలో భారత ప్రధాన న్యాయమూర్తిని తప్పించి, కేంద్ర ప్రభుత్వం కొత్త గా తీసుకువచ్చిన చట్టం ఏకపక్షంగా ఉండటంతోనే ఎన్నికల కమిషన్ అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నదనే విమర్శ కూడా ఉంది. ఇటీవల మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభకు పోటీచేసిన తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ నామినేషన్‌ను ఎన్నికల సంఘం తిరస్కరించింది.అయితే, ఈ క్రమంలో ఈసీ వ్యవహరించిన తీరు పై అనుమానాలు రాకమానదు. ఎన్నికలు నిస్సందేహం గా, నిష్పక్షపాతంగా జరగాలి. ఎన్నికల పవిత్రతను కాపాడాల్సిన అంతిమ బాధ్యత ఎన్నికల సంఘంపైనే ఉం టుంది. కానీ, కంచె చేను మేసిందన్నట్లుగా ఎన్నికల సం ఘం నిర్ణయం ఉన్నది. నిజంగానే అభ్యంతరాలు ఉంటే వివరణ కోరాల్సింది. అయితే, ఎన్నికల కమిషన్ అలా చేయలేదు. తెలంగాణలో ఎలాంటి ఎఫ్ఐఆర్ లేకుండా, మీనాక్షికి సంబంధం లేని కేసులో వచ్చిన నోటీసులను సాకు చూపి నామినేషన్ తిరస్కరించడం సబబు కాదు. ఈ తతంగం వెనుక బీజేపీ ఉందనే ప్రచారం జరుగుతున్నది.మొన్నటికి మొన్న తమిళనాడులో గవర్నర్ అవలంబించిన తీరు ప్రజాస్వామ్య వ్యవస్థలో ఆందోళన కలిగించింది. అక్కడ ప్రజలు ఎన్నుకున్న అతిపెద్ద పార్టీని ప్రమాణస్వీకారానికి పిలువకుండా, రెండు రెండు ఆరు అన్నట్లుగా గవర్నర్ వ్యవహారశైలి ఉన్నది. బీజేపీ ఏజెంట్‌గా వ్యవహరించి తన సీటు గౌరవాన్ని తగ్గించారు. గవర్నర్‌కు సొంతంగా నిర్ణయాలు తీసుకునే అధికారం చాలా పరిమితమని తెలిసి కూడా కర్రపెత్తనానికి ఒడిగట్టారు. రాజ్యాంగ పరిషత్ చర్చల్లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గవర్నర్ల పాత్రను చాలా స్పష్టంగా వివరించారు.బ్రిటిష్ పార్లమెంటరీ విధానంలోని ‘ది కింగ్ కెన్ డూ నో రాంగ్’ అనే సూత్రం తెలిసినట్టుగా లేదు. రాజ్యాంగ నిబంధనల ప్రకారం చూసినా తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత విజయ్‌కు ముఖ్యమంత్రిగా మొదటి అవకాశం ఇవ్వాలి. రాజ్యాంగంలోని ఆర్టికల్ 164(1) ప్రకారం, అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఏ ఒక్క పార్టీకి లేదా కూటమికి స్పష్టమైన మెజారిటీ రానప్పుడు, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు అతి పెద్ద పార్టీ నాయకుడిని ఆహ్వానించే విచక్షణాధికారం గవర్నర్‌కు ఉంటుంది.అయితే, ఎమ్మెల్యేల సంతకాలు ముందే కావాలని గవర్నర్ పట్టుబట్టారు. ఇది ముమ్మాటికీ గతంలో ఎన్నడూ లేని కొత్త నిబంధనలను సృష్టించడమేనని న్యాయ నిపుణులు అభిప్రాయపడ్డారు. ఈ తతంగాన్ని చూశాక గవర్నర్ వ్యవస్థ అనేది కేంద్ర ప్రభుత్వం చేతుల్లో పావుగా మారిందని అందరికీ అర్థమైపోయింది. మెజారిటీ ఉందో, లేదో తేల్చాల్సింది లోక్‌భవన్ గదుల్లో కాదు కదా? ఈ ప్రాథమిక సూత్రాన్ని విస్మరించి విజయ్ వద్ద మ్యాజిక్ ఫిగర్ లేదని సాకు చూపుతూ ప్రమాణ స్వీకారానికి ఆహ్వానించక, ప్రజా తీర్పును లోక్‌భవన్ అవమానించింది. అసెంబ్లీ వేదికగా మాత్రమే బలనిరూపణ జరగాలని సుప్రీంకోర్టు గతంలో పలు తీర్పుల్లో స్పష్టం చేసిన విషయాన్ని మరువరాదు.

# పాపం షర్మిళ... ఏటీ చేద్దాం

కడప, జూన్ 15

వైయస్ షర్మిల తీవ్ర ఆగ్రహంతో ఉన్నారా? కాంగ్రెస్ పార్టీ తీరుపై ఆవేదనతో ఉన్నారా? తీవ్ర నిర్ణయం దిశగా అడుగులు వేస్తున్నారా? తనకు రాజ్యసభ పదవి ఇవ్వకపోవడంపై కొందరి హస్తం ఉందన్న అనుమానాలు ఆమెలో ఉన్నాయా? అందుకే ఇండియా కూటమి సమావేశానికి ఆమె గైర్హాజరయ్యారా? ఏపీ పొలిటికల్ సర్కిల్లో దీనిపైనే చర్చ నడుస్తోంది. కొద్ది రోజుల కిందట కర్ణాటక నుంచి రాజ్యసభకు షర్మిలను ఎంపిక చేస్తారన్న ప్రచారం జరిగిన సంగతి తెలిసిందే. ఆమెను ఢిల్లీ పిలిచి కాంగ్రెస్ అగ్ర నేతలు అభయం కూడా ఇచ్చారట. కానీ ఇంతలోనే సమీకరణలు మారిపోయాయి. చివరి నిమిషంలో షర్మిల పేరు లేకుండా పోయింది. అయితే కాంగ్రెస్ పార్టీ కోసం తాను నిలబడితే.. పార్టీ మాత్రం ఇచ్చిన మాట కట్టుబడి ఉండలేదన్న ఆవేదన షర్మిల లో ఉన్నట్లు తెలుస్తోంది. ఆ బాధతోనే రెండు రోజుల కిందట ఢిల్లీలో జరిగిన ఇండియా కూటమి సమావేశానికి ఆమె గైర్హాజరైనట్లు తెలుస్తోంది.2024 ఎన్నికలకు ముందు ఏపీ కాంగ్రెస్ బాధ్యతలు తీసుకున్నారు షర్మిల. తెలంగాణలో తన తండ్రి పేరుతో పార్టీ ఏర్పాటు చేశారు. కానీ వర్కౌట్ కాకపోవడంతో కాంగ్రెస్ పార్టీలో విలీనం చేశారు తన పార్టీని. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఏదో ఒక నియోజకవర్గంలో నుంచి పోటీ చేయాలని భావించారు. అయితే ఏపీలో పార్టీ బాధ్యతలు తీసుకుంటే రాజ్యసభకు అవకాశం ఇస్తామని.. అది కూడా కర్ణాటక నుంచి ఛాన్స్ కల్పిస్తామని అప్పట్లో అగ్రనేతలు రాహుల్ గాంధీ, సోనియా గాంధీ హామీ ఇచ్చారు. అప్పటినుంచి కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఆమె కృషి చేస్తూ వచ్చారు. కర్ణాటక నుంచి రాజ్యసభ పదవులు ఖాళీ అయ్యాయి. అక్కడినుంచి ఛాన్స్ దక్కుతుందని భావించారు షర్మిల. అందుకు తగ్గట్టుగానే ఢిల్లీ నుంచి సమాచారం రావడంతో వెళ్లి వచ్చారు. నామినేషన్ వేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. కానీ చివరి నిమిషంలో కాంగ్రెస్ హై కమాండ్ హ్యాండిచ్చింది. అయితే ఏపీలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతల ద్వారానే.. తనకు రాజ్యసభ పదవి రాకుండా కుట్ర జరిగిందన్నది షర్మిల లో ఉన్న అనుమానం.ప్రధానంగా కర్ణాటక కాంగ్రెస్ నేతలతో వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డికి మంచి సంబంధాలు ఉన్నాయి. అందుకే ఆయన బెంగుళూరులో తన రాజకీయ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు అన్న ప్రచారం ఉంది. అయితే ఇప్పుడు అదే కర్ణాటక కాంగ్రెస్ నేతలతో కలిసి జగన్మోహన్ రెడ్డి తనకు రాజ్యసభ పదవి రాకుండా అడ్డుకున్నారన్న అనుమానం షర్మిల లో ఉంది. ఇదే విషయాన్ని పరోక్షంగా ఇటీవల ఆమె ఒక ట్వీట్ చేసినట్లు తెలుస్తోంది. పైగా జగన్మోహన్ రెడ్డిని మచ్చిక చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి అన్న అనుమానాలు కాంగ్రెస్ హై కమాండ్ పై ఉన్నాయి. ఈ అనుమానాలతోనే ఆమె కాంగ్రెస్ హై కమాండ్ పై రగిలిపోతున్నారు. అందుకే కీలకమైన ఇండియా కూటమికి గైర్హాజరయ్యారు. ఇదే పరిణామాలు కొనసాగితే షర్మిల తీవ్ర



నిర్ణయం దిశగా అడుగులు వేసే అవకాశం ఉంది. చూడాలి మరి ఏం జరుగుతుందో..

# మాజీ ఐపీఎస్ వర్సెస్ మాజీ ఎంపీ...

## రసకందాయంలో రాజకీయం

రాజమండ్రి, జూన్ 15

ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు చెందిన సీనియర్ ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్‌పై మాజీ ఎంపీ హర్ష కుమార్ సంచలన ఆరోపణలు చేశారు. ఆర్ఎస్ఎస్ సమావేశానికి ఒక్క పీవీ సునీల్ కుమార్‌కు మాత్రమే ఎందుకు ఆహ్వానం వచ్చిందని ఆయన ప్రశ్నించారు. అందువల్లే ఆయన్ను ప్రభుత్వం అరెస్ట్ చేయలేక పోతుందేమోనని, ఆయన ఎక్కడ మీటింగ్ పెట్టినా ప్రభుత్వం అనుమతులు ఇస్తుందని అనుమానాలు వ్యక్తం చేశారు.గతంలో ఆర్ఎస్ఎస్ సమావేశానికి హాజరై.. అక్కడ తాను గ్రహించిన విషయాలను ఫిబ్రవరి 10న పీవీ సునీల్ కుమార్ ఫేస్ బుక్‌లో పోస్టు చేశారు. ఆ పోస్టు స్క్రీన్ షాట్‌ను సోషల్ మీడియాలో పోస్టు చేసిన హర్ష కుమార్.. ఆయన ఆర్ఎస్ఎస్ అని అర్థమైపోతుందన్నారు. అనంతరం ఫేస్ బుక్‌లో వీడియో పోస్టు చేసిన హర్ష కుమార్.. ముందు జాగ్రత్తగా జాతిని హెచ్చరిస్తూ తాను ఈ పోస్టు చేశానన్నారు.“పీవీ సునీల్ నాకు బాగా తెలిసినాయనే. నేను ఎంపీగా ఉన్నప్పుడు ఆయన ఒకసారి నా దగ్గరికి వచ్చారు. గుంటూరు ఐజీ ఖాళీగా ఉందని, వేయించమని కోరారు. నేను సీఎంతో మాట్లాడి వేయించాను. వేయించలేదని బైబిల్ పట్టుకొని ప్రమాణం చేయమని సునీల్ కుమార్‌ను చెప్పమనండి. తర్వాత మా మధ్య సంబంధాలు లేవు. రఘురామకృష్ణను కొట్టినప్పుడు.. అది తప్పు కాబట్టి నేను రఘురామ వైపు మాట్లాడి .. సునీల్ కుమార్ తీరును తప్పుబట్టాను. పీవీ సునీల్ కుమార్ ఆర్ఎస్ఎస్ గురించి చేసిన పోస్టును ఎవరో నాకు పంపించారు. బౌద్ధ ఆచారాల ప్రకారం సునీల్ కుమార్ తండ్రి అంత్యక్రియలు నిర్వహించారని నాతో ఒకరు చెప్పారు. దీంతో చింతలపూడిలో నాకు తెలిసిన వాళ్లకు ఫోన్ చేసి అడిగితే.. బౌద్ధ సంప్రదాయం ప్రకారం సునీల్ తండ్రి అంత్యక్రియలు చేసిన మాట నిజమేనని చెప్పారు. ఆర్ఎస్ఎస్ ఇతణ్ని ప్రమోట్ చేస్తుందనే అనుమానం వచ్చేలా నాకు చాలా పోకడలు కనిపించాయి. అందుకే జాతిని ముందే మేల్కొలపాలనే ఉద్దేశంతోనే ఈ పోస్టు పెట్టాను. సునీల్ కుమార్ తన భార్యను హింసించడంతో ఆమె కేసు పెట్టింది. ఆయనపై ఆర్ఆర్ఆర్‌వి కాకుండా చాలా కేసులు ఉన్నాయి’ అని హర్ష కుమార్ వ్యాఖ్యానించారు.మాజీ ఎంపీ హర్ష కుమార్ చేసిన పోస్టు పట్ల సునీల్ కుమార్ పరోక్షంగా స్పందించారు. ‘పైకి ట్రిపుల్ ఆర్ (రఘురామ కృష్ణరాజు)తో పోరాడుతున్నట్లు నటిస్తూ.. అతని ఏజెంట్లుగా పని చేస్తున్నవాళ్లు దొరికిపోతున్నారు. వీళ్లను ఏం చేయాలో జాతికి తెలుసు’ అని సునీల్ కుమార్ ఫేస్‌బుక్‌లో పోస్టు చేశారు.ఈ పోస్టు కింద సునీల్ కుమార్ అభిమానులు చేస్తున్న కామెంట్స్‌ను బట్టి ఆయన చేసిన ఈ పోస్టు హర్ష కుమార్‌ను ఉద్దేశించేదనని అర్థమవుతోంది. ‘కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రణబ్ ముఖర్జీ లాంటి పెద్ద పెద్ద లీడర్లు సైతం ఆర్ఎస్ఎస్ ఆహ్వానం మేరకు ఆర్ఎస్ఎస్ సభలకు హాజరయ్యారని.. అంత మాత్రాన ప్రణబ్ ముఖర్జీ బీజేపీ మనిషి అయ్యారా? అప్పుడు హర్ష కుమార్ కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నారు. వారిని విమర్శించలేని హర్ష కుమార్ గత చరిత్ర మరచి పీవీ సునీల్ గారి మీద బురద జల్లుతున్నారు. హర్ష కుమార్, ఆయన కుమారుడి రాజకీయ పీఠాలు కదులుతాయని భయమా? లేదా ఆర్ఆర్ఆర్‌కు కోవర్టులుగా పని చేస్తున్నారా?’ అని ప్రభుదాస్ అనే వ్యక్తి పీవీ సునీల్ కుమార్ పోస్టు కింద కామెంట్ చేశారు.పీవీ సునీల్ కుమార్ ఇటీవల భీమవరం సభలో మాట్లాడుతూ.. చర్చికి వెళ్లినంత మాత్రాన, ఇంట్లో బైబిల్ ఉన్నంత మాత్రం క్రిస్టియన్లు కారని.. బాప్టిజం తీసుకున్న వారే క్రైస్తవులు అవుతారని వ్యాఖ్యానించారు. తన తండ్రి అంత్యక్రియలను క్రైస్తవ పద్ధతిలోనే చేశానని.. దమ్ముంటే తన ఎస్సీ సర్టిఫికెట్ రద్దు చేయాలని సవాల్ చేశారు. ఈ మీటింగ్ సక్సెస్ కావడంతో రఘురామ కోవర్టులు ఒక్కొక్కరుగా బయటకు వస్తున్నారని ఆయన ఫేస్‌బుక్‌లో పోస్టు చేశారు.

===============

# సత్తుపల్లి, కొవ్వూరు కొత్త లైన్ తో తగ్గనున్న దూరం

ఏలూరు, జూన్ 15,

తెలుగు రాష్ట్రాల మధ్య ప్రతిష్ఠాత్మకమైన సత్తుపల్లి–కొవ్వూరు రైల్వే లైన్ ప్రాజెక్టును త్వరితగతిన పట్టాలెక్కించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తాజాగా రైల్వే బోర్డును కోరింది. ఈ ప్రాజెక్టు నిర్మాణం వల్ల రైల్వే శాఖకు భారీగా ఆదాయం సమకూరుతుందని, వ్యయంతో పోలిస్తే వచ్చే రాబడి 14 శాతానికి పైగానే ఉంటుందని ఏపీ ప్రభుత్వం తాజా నివేదికలో స్పష్టం చేసింది. సాధారణంగా ఏదైనా ప్రాజెక్టుకు ఎఫ్ఐఆర్ఆర్ 10 శాతానికి పైగా ఉంటేనే రైల్వే శాఖ లాభసాటిగా భావిస్తుంది. ఈ ప్రాజెక్టుకు అంతకంటే ఎక్కువ ఆదాయం వచ్చే అవకాశం ఉండటంతో రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఎలాంటి వాటా ఆశించకుండా పూర్తిగా కేంద్ర ప్రభుత్వ నిధులతోనే దీనిని నిర్మించాలని ఏపీ ప్రభుత్వం రైల్వే బోర్డు ముందు ప్రతిపాదించింది.నిజానికి భద్రాచలం రోడ్ (కొత్తగూడెం) నుంచి కొవ్వూరు వరకు రైల్వే లైన్ ప్రాజెక్టు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే మంజూరైంది. అప్పట్లో ఈ ప్రాజెక్టు వ్యయంలో సగం వాటాను రాష్ట్ర ప్రభుత్వం భరించాలని రైల్వే శాఖ షరతు విధించింది. అయితే, రాష్ట్ర విభజన తర్వాత మారిన రాజకీయ, ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో ఈ ప్రాజెక్టుకు నిధులు వెచ్చించేందుకు తెలంగాణ ప్రభుత్వం ముందుకు రాలేదు. మరోవైపు సింగరేణి కాలరీస్ గనుల నుంచి బొగ్గు రవాణాను సులభతరం చేసేందుకు తెలంగాణ పరిధిలోని భద్రాచలం రోడ్ నుంచి సత్తుపల్లి వరకు ఇప్పటికే రైల్వే లైన్ నిర్మించారు. ఇప్పుడు సత్తుపల్లి నుంచి కొవ్వూరు వరకు మిగిలిన 118.9 కిలోమీటర్ల మేర కొత్త లైన్ నిర్మిస్తే ఈ కీలక అనుసంధానం పూర్తవుతుందని ఏపీ ప్రభుత్వం వివరిస్తోంది. ఈ ప్రతిపాదిత మార్గంలో ఏపీ పరిధి 70.31 కిలోమీటర్లుగా ఉంది.ఈ ప్రాజెక్టుకు అయ్యే ఖర్చులో ఏపీ ప్రభుత్వం సగం నిధులు ఇవ్వాలని లేదా కనీసం భూసేకరణ వ్యయాన్నైనా భరించాలని రైల్వే శాఖ గతంలో పట్టుబట్టింది. అయితే ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలో ఈ ప్రాజెక్టును కేంద్రమే చేపడుతుందని స్పష్టమైన హామీ ఉన్నందున.. రైల్వే శాఖే పూర్తి నిధులు కేటాయించాలని ఏపీ ప్రభుత్వం వాదిస్తోంది. ఈ లైన్ సాకారమైతే కొత్తగూడెం, మణుగూరు ప్రాంతాల్లోని సింగరేణి గనుల నుంచి సేకరించే బొగ్గును కాకినాడ పోర్టుకు తరలించడానికి రైలు మార్గంలో సుమారు 140 కిలోమీటర్లకు పైగా దూరం తగ్గుతుంది. దీనివల్ల రవాణా ఖర్చులు భారీగా తగ్గడమే కాకుండా... సమయం కూడా ఆదా అవుతుంది. పారిశ్రామికంగా, రవాణా పరంగా ఎంతో కీలకమైన ఈ ప్రాజెక్టును వెంటనే ప్రారంభించాలని, రాష్ట్ర ప్రభుత్వం తరఫున భూసేకరణతో పాటు అన్ని రకాల పరిపాలనాపరమైన సహకారం అందిస్తామని ఏపీ ప్రభుత్వం స్పష్టం చేసింది.

# దువ్వాడ దారెటు...

విజయనగరం , జూన్ 15,రీల్స్ “రాజా” పరిస్థితి దారుణంగా మారిపోయింది. పుట్టింటి వాళ్ళు వదిలేశారు. నమ్ముకున్న పార్టీ తరిమేసింది.. అన్నట్టుగా ఆయన పరిస్థితి మారిపోయింది. తాడేపల్లి నుంచి క్లియర్ మెసేజ్ వచ్చింది. రీ ఎంట్రీ లేదని అన్ని మూసుకొని కూర్చోవాలని.. పార్టీ అధిష్టానం చెప్పేసింది. ఇప్పుడు ఏం చేయాలి.. చీరలు అమ్ముకుంటూ.. రీల్స్ చేసుకుంటూ బతకాలి.. ఇది ఆ సిట్టింగ్ ఎమ్మెల్సీ పరిస్థితి.ఉత్తరాంధ్రలో దువ్వాడ శ్రీనివాస్ కు ఒకప్పుడు భారీగానే ఫాలోయింగ్ ఉండేది. ఫ్యాన్ పార్టీలో ఆయన ఎమ్మెల్సీ కూడా. ఆయన జీవితంలోకి మాధురి రావడంతో పరిస్థితి మారిపోయింది. రాజకీయంలో హత్యలు ఉండవు ఆత్మహత్యలు మాత్రమే ఉంటాయి అనే సామెత అతని ద్వారా మరోసారి నిరూపితమైంది. భార్యను.. ఇద్దరి పిల్లల్ని వదిలిపెట్టి ఆయన తన దారితను చూసుకున్నాడు. వృద్ధాప్యంలో యవ్వనం లాగా.. పడుచు కుర్రాడి లాగా రెచ్చిపోతున్నాడు. మాధురితో రీల్స్ చేయడం.. టీవీ చానల్స్ లలో ముద్దులు పెట్టడం.. ఇలా రకరకాల హంగామా చేస్తున్నాడు.దీనివల్ల 2024 లో పార్టీకి చాలావరకు డ్యామేజ్ జరిగింది. టెక్కలి నియోజకవర్గం లోనే కాకుండా.. ఉత్తరాంధ్ర మొత్తంలో పార్టీకి పెద్ద దెబ్బ పడిపోయింది. ఈ నేపథ్యంలో ఇటీవల ఆయన అసెంబ్లీలో జగన్మోహన్ రెడ్డిని కలిశారు. అప్పటికప్పుడు జగన్మోహన్ రెడ్డి ఏమి చెప్పకపోయినప్పటికీ.. వచ్చి కలువు అన్నారు. అయితే ఇంతవరకు అపాయింట్మెంట్ దొరకలేదు. చివరికి తాడేపల్లి ప్యాలస్ నుంచి క్లియర్ మెసేజ్ వచ్చేసింది. రీ ఎంట్రీ లేదని స్పష్టంగా వర్తమానం అందింది.వైసీపీలోకి మళ్ళీ వెళ్లడానికంటే ముందు శ్రీనివాస్ బిజెపి.. టిడిపి.. జనసేన నాయకులతో మంతనాలు జరిపారు. పార్టీలో చేర్చుకోవాలని వర్తమానం పంపించారు. ఏ పార్టీ నుంచి కూడా సరైన స్థాయిలో స్పందన రాలేదు. మరోవైపు తాడేపల్లి ప్యాలెస్ గేటు కాదు కదా కనీసం ప్రహరీ గోడ కూడా టచ్ చేయడానికి అవకాశం లేదని వర్తమానం అందడంతో శ్రీనివాస్ అంతర్మదనంలో ఉన్నారు. ఆయన సన్నిహితురాలు ప్రస్తుతం హైదరాబాదులో చీరల వ్యాపారం చేస్తున్నారు. ఆయన కూడా అక్కడే ఉంటున్నారు. అప్పుడప్పుడు ఉత్తరాంధ్రకు వెళ్లి పలు కార్యక్రమాలలో పాల్గొంటున్నారు. అన్ని పార్టీలు డోర్లు క్లోజ్ చేయడంతో.. శ్రీనివాస్ ఏం చేస్తారు.. ఇండిపెండెంట్గా రంగంలోకి దిగుతారా.. లేక రీల్స్ చేసుకుంటూ.. సోషల్ మీడియా ఛానల్స్ కు ఇంటర్వ్యూలు ఇచ్చుకుంటూ వెళ్తారా అనేది చూడాల్సి ఉంది..

# అక్బర్ బాగ్ లో ఉద్రిక్తత

## హిందూ సంఘాల అందోళన

హైదరాబాద్ జూన్ 15, హైదరాబాద్ పాతబస్తీ చదర్ ఘట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అక్బర్బాగ్లో బంగారు మైసమ్మ దేవాలయం సమీపంలో బట్టలు ఆరేయడాన్ని దేవాలయానికి చెందిన కుటుంబ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో రెండు వర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం కొందరు యువకులు దేవాలయ కుటుంబ సభ్యులపై తీవ్రంగా దాడి చేశారు.ఈ ఘటన తెలుసుకున్న హిందూ సంఘాలు వందల సంఖ్యలో అక్కడికి చేరుకోవడంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బీజేపీ నాయకులు వీరేందర్ యాదవ్, వినోద్, నరసింహ, రాజేష్, బి ర్ స్ నాయకులు శ్రీధర్ రెడ్డి, బస్తి వాసులు, స్థానికులు ఘటనా స్థలానికి చేరుకొని ధర్నా చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు చార్మినార్ జోన్ డీసీపీ కిరణ్ ఖారే ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. బాధితులఫిర్యాదు తో చదర్ఘాట్ పోలీసులు కేసు నమోదు చేసి, నిందితులను అదుపులోకి తీసుకుని దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు డీసీపీ తెలిపారు.అక్బర్ బాగ్ పరిసరాల్లో భారీ బందోబస్తు ఏర్పాటు చేసి దేవాలయం వద్ద పికెటింగ్ ఏర్పాటు చేశారు....

# వీడని జ్ఞానేశ్వరి అదృశ్యం మిస్టరీ.. రంగంలోకి పవన్!

కాకినాడ, జూన్ 15,

కాకినాడ జిల్లా తుని మండలంలో చిన్నారి జ్ఞానేశ్వరి



అదృశ్యం ఘటన స్థానికంగా తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. : చిన్నారి జ్ఞానేశ్వరి అదృశ్యం ఘటన మిస్టరీ ఇంకా వీడడం లేదు. ఆ చిన్నారి అదృశ్యమై ఎనిమిది రోజులు గడుస్తోంది. వందలాది మంది పోలీసులు జల్లెడ పడుతున్నారు. కానీ ఇంతవరకు ఆచూకీ లేదు. ఈ నేపథ్యంలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్పందించారు. ఈ ఘటనపై ఆరా తీసారు. కాకినాడ ఎస్పీతో ఫోన్లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. చిన్నారి జ్ఞానేశ్వరి ఆచూకీ కనుకునేందుకు మరిన్ని బృందాలను రంగంలోకి దించాలని ఆదేశించారు. గాలింపు చర్యల్లో పోలీస్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలతో పాటు ఎన్టీఆర్ బృందాలను రంగంలోకి దించాలని ఆదేశించారు. దట్టమైన అడవుల్లో సైతం వెళ్ళగలిగే అటవీ శాఖ నైట్ వాచర్స్, బేస్ క్యాంపు వాచర్స్, నిపుణుల సహాయం తీసుకోవాలని సూచించారు. పరిసర అటవీ ప్రాంతాల్లో జల్లెడ పట్టాలని కూడా ఆదేశాలు జారీ చేశారు పవన్ కళ్యాణ్.కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, పోలీసులు పలుమార్లు గాలింపు చర్యలు చేపట్టినా చిన్నారి ఆచూకీ ఇప్పటివరకు లభించలేదు. చిన్నారి కనిపించకుండా పోయినప్పటి నుంచి ఆమె కోసం అన్ని దిశల్లో అన్వేషణ కొనసాగుతోంది. పాప సురక్షితంగా తిరిగి రావాలని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద వాతావరణం నెలకొనగా, చిన్నారి కోసం ప్రభుత్వం, అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.చిన్నారి జ్ఞానేశ్వరి మిస్సింగ్ కేసును అత్యంత ప్రాధాన్యంగా తీసుకున్న అధికారులు గాలింపు చర్యలను మరింత ముమ్మరం చేశారు. ఈ క్రమంలో ప్రత్యేక నైపుణ్యం కలిగిన హనుమాన్ టీం రంగంలోకి దిగింది. నిన్న అర్ధరాత్రి నుంచే అటవీ ప్రాంతాల్లో సెర్చింగ్ ఆపరేషన్ ప్రారంభించిన బృందాలు అడవిలోని ప్రతి ప్రాంతాన్ని జల్లెడ పడుతున్నాయి. చిన్నారి జాడ కోసం పోలీసులు, అటవీశాఖ సిబ్బంది, ప్రత్యేక బృందాలు సమన్వయంతో పనిచేస్తున్నాయి.ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తూ రెండు థర్మల్ డ్రోన్లను రంగంలోకి దించారు. రాత్రి సమయంలో కూడా స్పష్టమైన సమాచారాన్ని సేకరించేందుకు ఈ డ్రోన్లు సహాయపడుతున్నాయి. డ్రోన్ కెమెరాల ద్వారా అడవిలోని పొదలు, లోయలు, చేరుకోవడం కష్టమైన ప్రాంతాలను పరిశీలిస్తున్నారు. అటవీశాఖ అధికారులు, హనుమాన్ టీం సభ్యులు కలిసి విస్తృత స్థాయిలో గాలింపు కొనసాగిస్తున్నారు. చిన్నారి ఎక్కడైనా చిక్కుకుని ఉండొచ్చనే అనుమానంతో ప్రతి ప్రాంతాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తున్నారు.అటవీశాఖ అధికారుల ప్రాథమిక అంచనా ప్రకారం, ఆ ప్రాంతంలో మనుషులపై దాడి చేసే క్రూర జంతువులు ఉండే అవకాశం చాలా తక్కువగా ఉందని చెబుతున్నారు. దీంతో చిన్నారి క్షేమంగా ఉండే అవకాశాలపై ఆశాభావం వ్యక్తమవుతోంది. అయినప్పటికీ ఎలాంటి అవకాశాన్ని వదిలిపెట్టకుండా అధికారులు అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు. చిన్నారి జ్ఞానేశ్వరి ఆచూకీ కోసం కొనసాగుతున్న ఈ సెర్చ్ ఆపరేషన్‌పై స్థానిక ప్రజలు, కుటుంబ సభ్యులు ఆశగా ఎదురుచూస్తున్నారు. త్వరలోనే పాప జాడ లభించాలని అందరూ ప్రార్థిస్తున్నారు.

పోలీస్ శాఖ ఉక్కిరిబిక్కిరి..

చిన్నారి జ్ఞానేశ్వరి అదృశ్యం ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. 8 రోజులు దాటుతున్న ఆచూకీ దొరకకపోవడంతో పోలీస్ శాఖ ఉక్కిరిబిక్కిరి అవుతోంది. దాదాపు 400 మంది పోలీస్ సిబ్బంది గాలింపు చర్యలు పాల్గొంటున్నారు. అత్యాధునిక డ్రోన్లను సైతం వినియోగిస్తున్నారు. చిన్నారితో పాటు కనిపించకుండా పోయిన కుక్క ప్రత్యక్షం కావడంతో.. దానికి జిపిఆర్ఎస్ కట్టి అడవుల్లో వదిలారు.. అయినా సరే ఎటువంటి ఫలితం లేకపోయింది. అయినా సరే ప్రయత్నాల్లో ఉంది పోలీస్ శాఖ. ఈ నేపథ్యంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పోలీసు ఉన్నతాధికారులకు ఎప్పటికప్పుడు సమీక్షలు జరిపారు. కాకినాడ ఎస్పీకి నేరుగా ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ఈ అంశాన్ని సీరియస్ గా తీసుకున్నట్లు తెలుస్తోంది.

అయితే పోలీస్ శాఖ గత ఎనిమిది రోజులుగా చేపట్టిన దర్యాప్తును వివరించారు కాకినాడ జిల్లా ఎస్పీ. చిన్నారి ఇంటి పరిసరాల్లో 38 సీసీ కెమెరాల్లో ఫుటేజీని పరిశీలించామని ఎస్పీ వివరించారు. కాగా జ్ఞానేశ్వరి అదృశ్యం కేసులో అనూహ్య పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఈ కేసులో కీలకంగా మారిన పెంపుడు కుక్క ఊహించని రీతిలో చనిపోయింది. గత రెండు రోజులుగా విచిత్రంగా ప్రవర్తించిన ఆ కుక్క.. చివరకు శనివారం చనిపోయింది. చిన్నారితో పాటుగానే ఈ కుక్క కనిపించకుండా పోయింది. నాలుగు రోజుల కిందట తిరిగి వచ్చింది. చిన్నారి ఇంటి వద్దకు చూసి కంగారుతో అడవిలోకి పారిపోయింది. అతి కష్టం మీద ఆ కుక్కను బంధించారు. ఆ కుక్కకు జిపిఎస్ ట్రాకర్ అమర్చి చిన్నారి జాడ తెలుసుకునేందుకు పోలీసులు ప్రయత్నించారు. ఆ ప్రయత్నం విఫలం కాగా.. శనివారం కుక్క సైతం చనిపోవడంతో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి.

# కేడర్ లో నిర్లేపం, నిక్షిప్తత

విజయవాడ,, జూన్ 15,

ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వానికి రెండేళ్ళ పూర్తవుతుంది. తాము సూపర్ సిక్స్ హామీలను అమలు చేశామని చంద్రబాబు, లోకేశ్ లు చెప్పుకుంటున్నారు. అయితే క్షేత్రస్థాయిలో మాత్రం హామీల అమలు మాత్రం సక్రమంగా జరగడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. తమకు మరో పదిహేనేళ్ల తిరుగులేదంటూ జబ్బలు చరుచుకుంటున్నా జగన్ ను విమర్శించడమే పనిగా పెట్టుకుంది. నియోజకవర్గాల్లో ఏం జరుగుతుందన్నది మాత్రం నాయకత్వం పట్టించుకోవడం లేదు. టీడీపీ నాయకత్వం గతంలో మాదిరిగా ఎమ్మెల్యేల పనితీరును మదింపు చేయడం లేదు. పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి వచ్చే నివేదికలపైనే ఆధారపడి ఆల్ ఈజ్ వెల్ అని ఫీలవుతుంది.కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పెట్టుబడులు పెరిగాయి. పరిశ్రమలు వస్తున్నాయి. అందులో ఎవరూ కాదనలేరు. కానీ ఎవరూ అభివృద్ధిని చూసే ఓటేయరు. సంక్షేమం అందరికీ అందడం లేదు. నిధుల కొరత కారణంగా, అధికారులు కొర్రీలు పెడుతూ చాలామందికి కోతలు పెట్టారు. హామీలు అన్ని అమలు పర్చామంటూ డప్పాలు కొట్టుకుంటే సరిపోదు. జనం ఏమనుకుంటున్నారో తెలుసుకుంటే చాలు జరుగుతున్న తప్పులు సరిదిద్దుకునే ప్రయత్నం చేయవచ్చు. ఎమ్మెల్యేల సమావేశం పెట్టినా, కార్యకర్తలతో మీటింగ్ లు పెట్టినా చెప్పడమే తప్ప వినడం తక్కువ కావడంతో వారి నుంచి ఫీడ్ బ్యాంక్ తీసుకోకపోవడమే ప్రధాన సమస్య. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే తమ సమస్యలన్నీ తీరతాయి భావించిన కార్యకర్తలకు నిరాశ ఎదురవుతుంది.మరొకవైపు కాలరెత్తుకుని కార్యకర్తలు తిరగొచ్చని, సూపర్ సిక్స్ హామీలను అమలు చేశామని ప్రజలకు చెప్పమని చంద్రబాబు అంటున్నా సగటు తెలుగుదేశం కార్యకర్తలు పెదవి విరుస్తున్నారు. నిన్నా మొన్నా వైసీపీ నుంచి వచ్చి చేరిన వారికి లభించే గౌరవం కూడా తమకు దక్కడం లేదంటూ నిట్టూరుస్తూన్నారు. ఆవేదనకు రెండేళ్ళు, అసంతృప్తికి రెండేళ్ళు, అంటూ తమలో నివురుగప్పిన నిప్పులా దాగున్న బాధను పంటికింద భరిస్తూ, లేని ఆనందాన్ని ముఖంలో నింపుకుంటూ ప్రజల్లోకి వెళ్లేదెలా? అని మనసులోనే కుమిలి పోతున్నారు. కక్కలేక మింగలేక మౌనం పాటిస్తున్నారు. ఇప్పటికైనా తెలుగుదేశం నాయకత్వం మేల్కొని క్షేత్రస్థాయిలో జరుగుతున్న వాస్తవ పరిస్థితులను గమనించాలని కోరుతున్నారు. తమ కష్టాన్ని గుర్తించాలని కార్యకర్తలు వేడుకుంటున్నారు.

# నిల్వ దాన్యాలను తరలించలేదు

## అందోళనలో రైతన్నలు

వికారాబాద్ జూన్ 15,

వికారాబాద్ జిల్లా యాలాల మండలంలో వరి కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉంచిన ధాన్యం ఇంకా తరలించకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శనివారం రాత్రి కురిసిన వర్షానికి యాలాల మండల కేంద్రంలోని కాగ్నా జలాల ఎఫ్పీఓ వరి కొనుగోలు కేంద్రంతో పాటు బెన్నూర్ వరి కొనుగోలు కేంద్రంలో నిల్వ చేసిన వరి ధాన్యం బస్తాలు తడిసిపోయాయి.

పంటను ఎంతో శ్రమించి పండించిన రైతులు ధాన్యం నాణ్యత దెబ్బతినకుండా కాపాడుకునేందుకు రాత్రంతా ఆందోళన చెందాల్సిన పరిస్థితి నెలకొంది. కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం పేరుకుపోయి రోజులు గడుస్తున్నా సంబంధిత అధికారులు స్పందించకపోవడంపై రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటికే వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో కొత్త సాగుకు పొలాలను చదును చేసుకునే సమయం ఆసన్నమైందని, అయితే ధాన్యం ఇంకా కేంద్రాల్లోనే ఉండటంతో తదుపరి వ్యవసాయ పనులు ఆలస్యమవుతున్నాయని రైతులు వాపోతున్నారు.

"మరికొన్ని రోజులు ఇలాగే కేంద్రాల వద్దే వేచి చూడాలా? ఇంకెప్పుడు ధాన్యాన్ని తరలిస్తారు?" అంటూ రైతులు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. తడిసిన ధాన్యానికి నష్టం కలగకుండా వెంటనే బస్తాలను తరలించి రైతులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి, కేంద్రాల్లో నిల్వ ఉన్న బస్తాలను అత్యవసరంగా తరలించాలని రైతులు కోరుతున్నారు.

# విజయ్ సంగీత కలుసుకున్నారు...

చెన్నై, జూన్ 15,

తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్.. తన భార్య సంగీతతో కొంతకాలంగా దూరంగా ఉంటున్నారు. విజయ్ త్రిషతో సన్నిహిత సంబంధం కొనసాగిస్తున్నారని తమిళనాడు మీడియాలో కొంతకాలంగా వార్తలు వస్తున్నాయి. వాటికి బలం చేకూర్చే విధంగా త్రిష, విజయ్ అనేక సందర్భాలలో కనిపించారు. లియో, గోట్ సినిమాలో వారిద్దరు కలిసి నటించారు. అంతకుముందు త్రిషతో విజయ్ కలిసి నటించిన గిల్లి సినిమా సరికొత్త చరిత్ర సృష్టించింది.విజయ్ ముఖ్యమంత్రి అయిన తర్వాత ప్రమాణ స్వీకార కార్యక్రమానికి త్రిష వచ్చింది. త్రిషను ఆయన తల్లి సాదరంగా ఆహ్వానించింది.. విజయ్ తండ్రి కూడా ఆమెను ప్రేమతో దగ్గరికి తీసుకున్నాడు. విజయ్ ఎన్నికల ఫలితాలలో ఎక్కువ సీట్లు సాధించిన తర్వాత.. తిరుపతి వెళ్ళిన త్రిష.. నేరుగా ఆయన ఇంటికి వచ్చి శుభాకాంక్షలు తెలియజేసింది. ఆ సమయంలో గంటపాటు త్రిష విజయ్ తో కలిసి ఉంది. ఇటీవల అజిత్ మాతృమూర్తి చనిపోయినప్పుడు త్రిష విజయ్ తో కలిసి వచ్చింది. అంతకుముందు ఓ వేడుకకు విజయ్ తోనే కలిసి కనిపించింది త్రిష.సంగీత ఎన్నికలకు ముందే విజయ్ తో తనకు విడాకులు కావాలని కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్ వాయిదాలో ఉంది. త్వరలో వారిద్దరి విడాకులకు సంబంధించి కోర్టు కీలకని తీర్పును వెల్లడించే అవకాశం ఉంది. ఇది ఇలా ఉండగానే విజయ్, సంగీత మళ్లీ కలిసిపోతున్నారని వార్తలు వస్తున్నాయి. కుటుంబ సభ్యులు జోక్యం చేసుకోవడంతో వారిద్దరు కలిసి జంటగా జీవించడానికి అంగీకారం తెలిపినట్టు తెలుస్తోంది.ముఖ్యంగా విజయ్ తల్లి శోభ ఇద్దరి మధ్య దూరాన్ని తగ్గించడానికి ప్రయత్నించినట్టు సమాచారం. అయితే ఇంతవరకు అధికారికంగా ఈ విషయంపై ప్రకటన రాలేదు. ఒకవేళ విజయ్, సంగీత కలిసిపోతే త్రిష పరిస్థితి ఏంటి అనే చర్చ కూడా నడుస్తోంది. వచ్చే రోజుల్లో వీరిద్దరి వ్యవహారం ఎటు దారితీస్తుందో చూడాలి.విజయ్ సీఎం అయిన తర్వాత భార్య సంగీత శుభాకాంక్షలు తెలియజేయలేదు. కుమారుడు జేసన్, కుమార్తె కూడా సోషల్ మీడియాలో కనీసం విషస్ కూడా చెప్పలేదు. కుమారుడు ఏకంగా తన పేరు నుంచి విజయ్ పేరు ని తొలగించుకోవడం విశేషం. అతడు సందీప్ కిషన్ తో సిగ్మా పేరుతో ఓ సినిమాకు దర్శకత్వం వహించాడు. ఇందులో ఫరియా అబ్దుల్లా హీరోయిన్.

# హ్యాట్రిక్ పై యోగి గురి

లక్నో, జూన్ 15,

భారత రాజకీయాల్లో అత్యంత ప్రాధాన్యత కలిగిన ఉత్తరప్రదేశ్ లో ఎన్నికల వేడి అప్పుడే మొదలైంది. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో చారిత్రాత్మక హ్యాట్రిక్ విజయాన్ని నమోదు చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని భారతీయ జనతా పార్టీ రికొత్త వ్యూహాలకు పదును పెడుతోంది. గతంలో లాగా కాకుండా, ఈసారి ఎన్నికలకు ముందే యోగి ఆదిత్యనాథ్ తామే సీఎం అభ్యర్థిగా బరిలోకి దిగుతారని పార్టీ జాతీయ నాయకత్వం అధికారికంగా ప్రకటించడం గమనార్హం. గత లోక్‌సభ ఎన్నికల్లో సమాజ్ వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ సాధించిన విజయాలకు బ్రేక్ వేయడమే కాకుండా, విపక్షాల ఓటు బ్యాంకును ముక్కలు చేసేందుకు యోగి మార్క్ పొలిటికల్ స్కెచ్ సిద్ధమైంది.అఖిలేష్ యాదవ్ విస్తృతంగా ప్రచారంలోకి తెచ్చిన ఖఆం పిచ్డే, దళిత్, అల్పసంఖ్యాక్ – వెనుకబడిన, దళిత, మైనారిటీల కూటమి ఫార్ములాను దెబ్బతీయడమే యోగి ప్రధాన ఎజెండా. దీనికోసం ఇటీవల యూపీ క్యాబినెట్‌ను విస్తరిస్తూ ఆరుగురు కొత్త మంత్రులతో యోగి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ విస్తరణ వెనుక పక్కా సోషల్ ఇంజనీరింగ్ దాగి ఉంది. సమాజ్ వాదీ పార్టీ బలంగా నమ్ముకునే యాదవేతర ఓబీసీ , దళిత సామాజిక వర్గాలకు మంత్రివర్గంలో పెద్దపీట వేయడం ద్వారా అఖిలేష్ యాదవ్ ఓటు బ్యాంకు పునాదులను కదిలించేలా యోగి వ్యూహాత్మక అడుగులు వేశారు. ఎస్పీ సాంప్రదాయ ఓటు బ్యాంకు అయిన యాదవేతర వెనుకబడిన కులాలను తమ వైపు తిప్పుకోవడం ద్వారా అఖిలేష్ ఖఆం ముసుగును తొలగించాలని యోగి ప్లాన్ చేస్తున్నారు. సమాజ్ వాదీ పార్టీలో యాదవుల ఆధిపత్యంపై అసంతృప్తిగా ఉన్న ఇతర ఓబీసీ ఉప-కులాలను మౌర్య, కుర్మీ, నిషాద్, రాజ్‌భర్ వంటి వర్గాలను బీజేపీ తన వైపు తిప్పుకుంటోంది. ఇందుకోసం చిన్న చిన్న ప్రాంతీయ పార్టీలతో పొత్తులను మరింత బలోపేతం చేయడంతో పాటు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు నేరుగా ఆయా సామాజిక వర్గాల చివరి లబ్ధిదారుడికి చేరేలా యోగి స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. కుల సమీకరణాలతో పాటు రాష్ట్రాన్ని కుదిపేసే క్రైమ్, గ్యాంగ్‌స్టర్ సంస్కృతిని ఉక్కుపాదంతో అణచివేయడం ద్వారా శాంతిభద్రతల అంశాన్ని మరోసారి తన ప్రధాన ఆయుధంగా మలుచుకుంటున్నారు.ఇక రాజకీయంగా విపక్షాలను డిఫెన్స్‌లో పడేసేందుకు యోగి ఆదిత్యనాథ్ మరోసారి తన పాత వైభవమైన 'హార్డ్ హిందుత్వ' అస్త్రాన్ని ప్రయోగించారు. ఇటీవల కుషీనగర్, గొండాలలో జరిగిన బహిరంగ సభల్లో ఆయన నేరుగా సమాజ్ వాదీ పార్టీని రామ విరోధులు గా అభివర్ణించారు. కాంగ్రెస్, సమాజ్ వాదీ పార్టీలు దశాబ్దాల పాటు అయోధ్య రామమందిర నిర్మాణాన్ని అడ్డుకున్నాయని, 500 ఏళ్ల హిందువుల నిరీక్షణకు డబుల్ ఇంజన్ సర్కార్ మాత్రమే ముగింపు పలికిందని గుర్తు చేశారు. అఖిలేష్ యాదవ్ ఇటీవల అవలంబిస్తున్న సాఫ్ట్



హిందుత్వ పాలిటిక్స్‌ను యోగి తీవ్రంగా ఎండగడుతున్నారు. అభివృద్ధి జాతీయ భద్రత అనే అంశాలను కూడా యోగి ప్రజల్లోకి బలంగా తీసుకెళ్తున్నారు. ఒకప్పుడు అల్లర్లకు, మాఫియాకు కేరాఫ్ అడ్రస్‌గా ఉన్న ఉత్తరప్రదేశ్‌లో ఇప్పుడు బ్రహ్మోస్ మిసైల్ తయారీ కేంద్రాలు వస్తున్నాయని, పాకిస్తాన్‌ను సైతం గడగడలాడించే రక్షణ పరిశ్రమలు యూపీ గడ్డపై ఏర్పాటవుతున్నాయని ఆయన చెప్పుకొస్తున్నారు. నవ్య అయోధ్య, కాశీ విశ్వనాథ్ కారిడార్ ద్వారా పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసి స్థానిక యువతకు ఉపాధి కల్పించామని, గతంలో జరిగిన పరీక్షల పేపర్ లీకేజీల నిందితులను జైలుకు పంపామని వివరిస్తున్నారు.అఖిలేష్ యాదవ్ కులాల వారీగా ఓట్లను ఏకం చేసే ప్రయత్నం చేస్తుంటే.. యోగి ఆదిత్యనాథ్ మాత్రం ఆ ఓట్లను చీలుస్తూ హిందూ ఓటు బ్యాంకును ఏకం చేస్తూనే, యాదవేతర వెనుకబడిన వర్గాలను అధికారంలో భాగస్వాములను చేసే ద్వంద్వ వ్యూహాన్ని అమలు చేస్తున్నారు. గడిచిన రెండు ఎన్నికల కంటే కూడా 2027 లో యూపీ అసెంబ్లీలో భారీ మెజార్టీతో బీజేపీ తిరిగి పీఠాన్ని దక్కించుకుంటుందని యోగి ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రూరమైన పొలిటికల్ మైండ్ గేమ్‌లో అఖిలేష్ యాదవ్ యోగి స్పీడ్‌ను ఎంతవరకు తట్టుకుంటారనేది రాబోయే రోజుల్లో తేలనుంది.

=

# నోరు.. అండర్ వేరూ.. ప్రతీ చోట కాపీ

లక్నో,జూన్ 15, ఉత్తర ప్రదేశ్ ఒకటి. ప్రస్తుతం అక్కడ పోలీస్ ఉద్యోగాలకు సంబంధించి ఎంపిక పరీక్షలు జరుగుతున్నాయి.. ఉత్తరప్రదేశ్ పెద్ద రాష్ట్రం కాబట్టి సహజంగానే నిరుద్యోగ సమస్య అధికంగా ఉంటుంది. పైగా చాలా రోజుల తర్వాత అక్కడి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయడంతో భారీగానే నిరుద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు.. ఇప్పటికే శారీరక దారుఢ్య పరీక్షలు పూర్తయ్యాయి. రాత పరీక్షలు నడుస్తున్నాయి. రాత పరీక్షలను అత్యంత పకడ్బందీగా నిర్వహించడానికి అక్కడి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ.. పరీక్ష నిర్వహిస్తున్న తీరు ఆందోళన కలిగిస్తోంది. విమర్శలకు దారితీస్తోంది.ఉత్తర్ ప్రదేశ్ లోని జౌన్‌పూర్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో నిర్వహించిన తనిఖీలు దేశవ్యాప్తంగా సంచలనం కలిగించాయి. అక్కడ డిటెక్టర్ తో ప్రతి అభ్యర్థిని తనిఖీ చేస్తున్నారు. ఒక అభ్యర్థి తన అండర్వేర్లో ఫోన్ పెట్టుకుని వచ్చాడు. అది కాస్త డిటెక్టర్ ద్వారా చేసిన తనిఖీల్లో బయటపడింది. దీంతో అభ్యర్థులను ముందుగా అండర్వేర్లో డిటెక్టర్ పెట్టి పరీక్షిస్తున్నారు. ఆ తర్వాత దానిని నోట్లో కూడా పెడుతున్నారు. అండర్వేర్ నుంచి నోరు వరకు దేనిని వదలకుండా డిటెక్టర్ పెడుతుండడంతో అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బయటికి నోరు మెదపకపోయినప్పటికీ.. ఉద్యోగం కావాలి కాబట్టి తప్పనిసరి పరిస్థితుల్లో దానిని తట్టుకుంటున్నారు."ఉద్యోగం సాధించాలంటే కష్టపడాలి. అందులో తప్పులేదు. కానీ ఇలా అండర్వేర్ లో డిటెక్టర్ పెట్టి మళ్ళీ దానిని నోట్లో పెడితే దానిని ఏమనుకోవాలి.. అసలు ఇలా తనిఖీ చేస్తారా.. దీనిని తనిఖీ అంటారా.. ఇంతగనం ఇబ్బంది పెడితే ఎలా పరీక్ష రాయాలి. పరీక్ష రాయడానికి వచ్చిన వారంతా కూడా పేద, మధ్య తరగతివారే. వారికి ఉద్యోగం కావాలి కాబట్టి ఇదంతా భరిస్తున్నారు. కానీ ఇంత ఇబ్బంది పడుతూ ఉద్యోగం సాధించడం అవసరమా అనిపిస్తోందని" సోషల్ మీడియాలో నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు.

## అర్ధరాత్రి రైలులో దొంగల బీభత్సం.. పోలీసులపై ఎదురుకాల్పులు!

బాపట్ల జూన్ 15,

జిల్లాలో అర్ధరాత్రి రైలులో దొంగలు బీభత్సం సృష్టించారు. చెంగల్పట్టు నుంచి కాకినాడ వెళ్తున్న సర్కార్ ఎక్స్ప్రెస్ పై అప్పికట్ల-మాచవరం మధ్య 2:30 సమయంలో దుండగులు దాడి చేశారు. ప్రయాణికుల నుంచి బంగారు ఆభరణాలు లాక్కున్నారు. బాధితులు కేకలు వేయడంతో చైన్ లాగి పరారయ్యారు. వీరిని అడ్డుకునేందుకు ఉఖీఖ పోలీసులు కాల్పులు జరపగా, దొంగలు కూడా ఎదురుకాల్పులు చేశారు. ఈ ఘటన తీవ్ర కలకలం రేపింది.

## ఆరు బస్సులను సీజ్ చేసిన అధికారులు

### స్కూల్ బస్సులపై రంగారెడ్డి జిల్లా రవాణా శాఖ అధికారుల దాడులు

రంగారెడ్డి జూన్ 15,

సోమవారం నుండి ప్రైవేట్ పాఠశాలలు పున ప్రారంభం కావడంతో విద్యార్థులను తరలించే స్కూల్ బస్సుల పై రవాణా శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.

ప్రతి బస్సును క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు. బస్సు కు సంబంధించిన ఆర్సి పర్మిట్ ఇన్సూరెన్స్ ఫిట్నెస్ పొల్యూషన్ తో పాటు డ్రైవర్ లైసెన్స్ చెక్ చేస్తున్నారు. విద్యార్థులను తరలించే స్కూల్ బస్సులో సేఫ్టీల విషయంలో ప్రత్యేక దృష్టి సారించారు. బస్సులో ఉండాల్సిన ఫైర్ పరికరాలు, మెడికల్ కిట్ విద్యార్థుల లిస్ట్ తోపాటు అనుభవం కలిగిన డ్రైవర్ బస్సు నడుపుతున్నాడు అనే విషయాలను పరిశీలిస్తున్నారు. 60 సంవత్సరాలు పైబడిన డ్రైవర్లు ఉన్నారని కోణంలో ప్రత్యేక డ్రైవ్ చేస్తున్నారు.

## తొమ్మిది రోజులైనా దొరకని చిన్నారి జాను ఆచూకీ

కాకినాడ జూన్ 15

చిన్నారి జాను జాడ తొమ్మిది రోజులైనా దొరకలేదు. మరోవైపు, జానుతో పాటు వెళ్లి తిరిగొచ్చి చనిపోయిన కుక్కకు పోస్ట్ మార్టం పూర్తి చేసారు. కుక్క శరీరంలో నుండి నమూనాలు సేకరించి విశాఖపట్నంలోని ఫోరెన్సిక్ ల్యాబ్కు పంపారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాలతో మరో 30 మంది ఎన్డీఆర్ఎఫ్ బృందం, ఇతర అధికారులు గాలింపు చర్యలు మొదలు పెట్టారు. చుట్టుపక్కల 7 టవర్ల పరిధిలో 4800 ఫోన్ కాల్స్ విశ్లేషించి, కొందరు అనుమానితులను గుర్తించారు. కాకినాడ జిల్లా తుని మండలం దొండవాక పంచాయతీ సీహెచ్ అగ్రహారం సమీపంలో 9 రోజుల క్రితం అడవిలోకి వెళ్లి తప్పిపోయింది చిన్నారి జాను

## జీహెచ్ఎంసీ చెత్త టిప్పర్ ఢీకొని ఇద్దరు ఆటో డ్రైవర్లు మృతి

హైదరాబాద్ జూన్ 15

జీహెచ్ఎంసీ చెత్త టిప్పర్ ఢీకొని ఇద్దరు ఆటో డ్రైవర్లు మృతి చెందారు.

మీర్పేట్ పోలీస్ స్టేషన్ సమీపంలో మండమల్లమ్మ చౌరస్తా వద్ద ఆటో పాడైపోయిందని సంతోష్(26) అనే ఆటో డ్రైవర్ తన స్నేహితులు ప్రసాద్, సునీల్(33)లకు సమాచారం ఇచ్చాడు. మండమల్లమ్మ చంద్రా గార్డెన్స్ వద్ద సంతోష్ ఆటోను తన ఆటోకు తాడుతో కట్టి తరలించేందుకు సునీల్, ప్రసాద్ సిద్ధమయ్యారు. ఆదే సమయంలో ఎల్బీనగర్ వైపు నుండి వేగంగా వచ్చిన జీహెచ్ఎంసీ చెత్త టిప్పర్ వారిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సంతోష్ అక్కడికక్కడే మృతి చెందగా, సునీల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు.

## బాలికపై అత్యాచారనీ మరియు హత్యాయత్నం చేసిన గౌస్ ని వెంటనే ఉరి తీయాలి...

### దుర్గా వాహిని విశ్వహిందూ పరిషత్

హైదరాబాద్ జూన్ 15

ఖమ్మం లోని 12 ఏళ్ల బాలిక పై 50 ఏళ్ల మహ్మద్ గౌస్ పాషా లైంగిక దాడి చేయడమే కాకుండా మేడ పై నుంచి కిందకు తోసేయడం అత్యంత దారుణమని విశ్వ హిందు పరిషత్ దుర్గా వాహిని ప్రాంత సంయోజిక వాణి సక్కుబాయి అన్నారు.

నిమ్స్ లో చికిత్స పొందుతున్న బాలికను వాణి సక్కుబాయి , దుర్గా వాహిని ప్రాంత సభ్యులు శిరీష, భవాని గాయత్రీలు పరామర్శించారు. అనంతరం వాణి సక్కుబాయి మాట్లాడుతూ.. బాలిక పై అత్యాచారం చేసిన నిందితుడిని సిట్టింగ్ జడ్జి తో విచారణ జరిపించి వెంటనే ఉరి తీయాలన్నారు. బాధిత కుటుంబానికి కోటి రూపాయల నష్ట పరిహారం తక్షణం అందించాలని, ఇంట్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. బాధిత కుటుంబానికి యావత్ సమాజం అండగా ఉండాలని తెలిపారు

# దూకుడు ప్రదర్శించని బీఆరెస్

హైదరాబాద్, జూన్ 15, (న్యూస్ పల్స్)

తెలంగాణ రాజకీయాల్లో భారత్ రాష్ట్ర సమితి ప్రస్తుతం ఒక విలక్షణమైన, అత్యంత సంక్లిష్టమైన దశను ఎదుర్కొంటోంది. అసెంబ్లీ ఎన్నికల పరాజయం తర్వాత, పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా గెలవలేకపోవడం గులాబీ శ్రేణులను తీవ్ర నైరాశ్యంలోకి నెట్టింది. పార్టీ పయనంపై రకరకాల ప్రచారాలు జరుగుతున్న సమయంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అంతర్గత సమావేశాల్లో వచ్చే ఎన్నికల్లో మనది ఒంటరి పోరే.. ఏ పార్టీతోనూ పొత్తులు ఉండవు అని గట్టిగా చెప్తున్నప్పటికీ, రాజకీయ వర్గాల్లో మాత్రం ఆ మాటలపై ఇంకా నమ్మకం కలగడం లేదు. దీనికి ప్రధాన కారణం.. కేంద్రంలోని బీజేపీపై, మోదీ ప్రభుత్వంపై కేటీఆర్ గానీ, కేసీఆర్ గానీ ఆశించిన స్థాయిలో దూకుడు ప్రదర్శించకపోవడమే.పార్లమెంట్ ఎన్నికల ఫలితాలను నిశితంగా గమనిస్తే, బీఆర్ఎస్ సాంప్రదాయ ఓటు బ్యాంకు క్రమంగా బీజేపీ వైపు మళ్లినట్లు స్పష్టమైంది. గతంలో గులాబీ వైపు నిలిచిన అర్బన్, సెమి-అర్బన్, హిందూ ఓటర్లు గంపగుత్తగా కమలం వైపు మొగ్గు చూపారు. తెలంగాణలో బీఆర్ఎస్ ఖాళీ చేసిన ప్రతిపక్ష స్థానాన్ని తామే భర్తీ చేశామని, కాంగ్రెస్కు ప్రత్యామ్నాయం తామేనని బీజేపీ గట్టిగా చాటుకుంటోంది. ఇలాంటి తరుణంలో, తమ ప్రధాన ప్రత్యర్థి కాంగ్రెస్ మాత్రమేనని, బీజేపీకి అసలు క్షేత్రస్థాయి బలం లేదని కేటీఆర్ ప్రకటిస్తున్నారు. కానీ, తమ ఓట్లను లాగేసుకున్న బీజేపీని ధాటుగా ఎదుర్కోకుండా, కేవలం కాంగ్రెస్నే టార్గెట్ చేయడం పొలిటికల్ సర్కిల్స్లో పలు అనుమానాలకు తావిస్తోంది. బీజేపీపై సాఫ్ట్ పాలిటిక్స్ నడుపుతూ.. రేపటి ఎన్నికల్లో ఆ పార్టీనే మాకు ప్రధాన ప్రత్యర్థి అని చెప్తే ప్రజలు కన్విన్స్ అవ్వడం కష్టమేన్న అభిప్రాయం వినిపిస్తోంది.బీఆర్ఎస్, బీజేపీల మధ్య లోపాయకారీ ఒప్పందం ఉందంటూ కాంగ్రెస్ చేస్తున్న ప్రచారాన్ని తిప్పికొట్టడంలో బీఆర్ఎస్ అధినాయకత్వం విఫలమవుతోంది. కవిత బెయిల్ వ్యవహారం దగ్గర నుంచి నేటి వరకు కేంద్ర సంస్థల దూకుడు తగ్గడం, పార్లమెంట్లో కీలక బిల్లులపై బీఆర్ఎస్ వ్యూహాత్మక మౌనం వహించడం వంటి పరిణామాలు బీజేపీ-బీఆర్ఎస్ భాయ్ భాయ్ అనే రూమర్లకు మరింత ఆజ్యం పోస్తున్నాయి. నిత్యం సోషల్ మీడియాలో, వార్తల్లో విలీనం లేదా పొత్తుల గురించిన రచ్చ జరుగుతూనే ఉంది. ఈ ప్రచారానికి శాశ్వతంగా చెక్ పెట్టాలంటే కేవలం ఆఫ్లైన్ ప్రకటనలు సరిపోవు, క్షేత్రస్థాయిలో బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలపై ఆన్లైన్, ఆన్గ్రౌండ్ పోరాటాలు చేయాల్సి ఉంటుందని అంటున్నారు. త్వరలో జరగబోయే గ్రేటర్ ఎన్నికలు బీఆర్ఎస్కు ఒక పెద్ద యాసిడ్ టెస్ట్. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ తన ఉనికిని కాపాడుకోవాలంటే.. అటు కాంగ్రెస్



వైఫల్యాలను ఎండగడుతూనే, ఇటు కేంద్రంలో ఉన్న బీజేపీ తెలంగాణకు చేసిన అన్యాయాలను అంతే తీవ్రంగా నిలదీయాలి. అలా కాకుండా కేవలం రేవంత్ రెడ్డి ప్రభుత్వంపైనే 100% ఫోకస్ పెట్టి, కేంద్రంపై చిన్న విమర్శ కూడా చేయకపోతే, ప్రజలు బీఆర్ఎస్ను కేవలం ఒక 'బి-టీమ్' గానే చూసే ప్రమాదం ఉంది. ఏదైనా ఒక ప్రాంతీయ పార్టీ జాతీయ పార్టీలతో తలపడేటప్పుడు రెండు వైపులా సమానమైన దూకుడు ప్రదర్శించినప్పుడే పొలిటికల్ సీరియస్నెస్ కనిపిస్తుంది. కేటీఆర్ మాటలకు, చేతలకు పొంతన లేదనే విమర్శలు పోవాలంటే.. బీజేపీ హిడెన్ ఎజెండాను కూడా గులాబీ పార్టీ అంతే ధీటుగా బట్టబయలు చేయాలి. లేదంటే, తాము ఒంటరిగానే పోటీ చేస్తామని బీఆర్ఎస్ ఎంత మొత్తుకున్నా, విశ్లేషకులు గానీ, అటు ఓటర్లు గానీ దాన్ని పెద్దగా పరిగణనలోకి తీసుకోరు. కాబట్టి, సాఫ్ట్ పాలిటిక్స్ పక్కనబెట్టి తీవ్రమైన దూకుడు ప్రదర్శించడమే ఇప్పుడు కేటీఆర్ ముందున్న ఏకైక మార్గం.

# కాంగ్రెస్ గూటికి జగన్ !

## చక్రం తిప్పుతున్న రేవంత్

హైదరాబాద్, జూన్ 15

రెండు తెలుగు రాష్ట్రాల రాజకీయాలు ఇప్పుడు ఒకదానికొకటి పెనవేసుకుని, అత్యంత ఆసక్తికరమైన చెస్ గేమ్ను తలపిస్తున్నాయి. ఒకవైపు ఆంధ్రప్రదేశ్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కేంద్రంలోని ఎన్డీయే కూటమికి వ్యతిరేకంగా మెల్లగా గళం విప్పుతున్న సూచనలు కనిపిస్తున్నాయి. జగన్ ప్రధాని మోదీ లేదా కేంద్ర ప్రభుత్వంపై నేరుగా వ్యక్తిగత విమర్శలు చేయకుండా, కేవలం విధానపరమైన వ్యతిరేకతను మాత్రమే ప్రదర్శిస్తూ ఆచి తూచి అడుగులు వేస్తున్నారు. ఇదే సమయంలో ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలకు కర్ణాటక నుంచి దక్కాల్సిన రాజ్యసభ సీటు చివరి క్షణంలో సాంకేతిక, రాజకీయ కారణాల వల్ల చేజారడం గమనార్హం. ఈ పరిణామాలు ఏపీలోనే కాకుండా, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పొలిటికల్ వ్యూహాల్లోనూ పెను మార్పులకు కారణమవుతున్నాయి.వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఎన్డీయే కూటమికి దూరంగా జరుగుతూ, లోపాయకారీగా కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నారనే సంకేతాలు పంపడం వెనుక పెద్ద వ్యూహమే ఉంది. ఏపీలో చంద్రబాబు, పవన్ కల్యాణ్, బీజేపీ కూటమిని ఒంటరిగా ఎదుర్కోవడం కంటే, జాతీయ స్థాయిలో యాంటీ-బీజేపీ శక్తులతో జతకట్టడం మేలనే యోచనలో ఆయన ఉన్నట్లు తెలుస్తోంది. దీనిని పసిగట్టిన తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి.. శుక్రవారం నాటి మీడియా చిట్చాట్లో జగన్కు అనుకూలంగా సానుభూతి వ్యాఖ్యలు చేయడం రాజకీయ వర్గాలను ఆశ్చర్యపరిచింది. ఏపీలో జగన్ సభలకు, ర్యాలీలకు కూటమి ప్రభుత్వం అనుమతులు నిరాకరిస్తోందంటూ రేవంత్ మాట్లాడటం వెనుక.. భవిష్యత్తులో జగన్ కాంగ్రెస్కు దగ్గరైతే తద్వారా వచ్చే పొలిటికల్ మైలేజీని ఒడిసిపట్టాలనే ముందస్తు ప్లాన్ కనిపిస్తోంది.ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుతో నొచ్చుకున్న ఒక వర్గాన్ని శాంతపరిచేందుకే, జగన్ సభల అనుమతులపై రేవంత్ సానుభూతి అస్త్రం విసిరారనే ప్రచారం సాగుతోంది. హైదరాబాద్ గుండెకాయ లాంటి అమీర్పేట్ జంక్షన్లో సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా దివంగత నేత ఎన్టీ రామారావు 23 అడుగుల భారీ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించడం తెలంగాణ రాజకీయాల్లో పెను దుమారం రేపింది. కాంగ్రెస్కు బద్ధశత్రువుగా ఉన్న ఎన్టీఆర్ విగ్రహాన్ని కాంగ్రెస్ ప్రభుత్వమే పెట్టడంపై తెలంగాణ సెంటిమెంట్ ఉన్న ఒక వర్గం తీవ్ర అసంతృప్తికి లోనైంది. ఈ చర్యతో బీఆర్ఎస్, మలిదశ ఉద్యమకారుల నుంచి రేవంత్ విమర్శలు ఎదుర్కొన్నారు. దీంతో అప్రమత్తమైన రేవంత్ రెడ్డి.. తెలంగాణలోని వైఎస్సార్



అభిమానులను, రెడ్డి సామాజికవర్గాన్ని సమతూకం చేయడానికి జగన్ ప్రస్తావన తెచ్చారని విశ్లేషకులు భావిస్తున్నారు. ఎన్టీఆర్ విగ్రహం ద్వారా ఆంధ్రా సెటిలర్లు, టీడీపీ సానుభూతిపరుల ఓట్లను కొల్లగొట్టడం.. అలాగే జగన్ సభలపై సానుభూతి చూపడం ద్వారా వైఎస్సార్ ఓటు బ్యాంకును కాపాడుకోవడం రేవంత్ మార్క్ డబుల్ గేమ్ .ఈ మొత్తం పరిణామాల వెనుక ఉన్న అసలు లక్ష్యం.. త్వరలో రాబోయే హైదరాబాద్ నగరపాలక సంస్థ ఎన్నికలే. హైదరాబాద్ పరిధిలో ఆంధ్రా మూలాలున్న ఓటర్లు, సెటిలర్లు గెలుపోటములను శాసిస్తారు. గతంలో ఈ ఓటు బ్యాంక్ అంతా బీఆర్ఎస్ వైపు నిలిచింది. ఇప్పుడు కేసీఆర్ బలహీనపడటంతో ఆ ఓట్లను కాంగ్రెస్ ఖాతాలో వేసుకోవడమే రేవంత్ రెడ్డి ఏకైక అజెండా. అందుకోసమే అటు ఎన్టీఆర్ అభిమానులను, ఇటు వైఎస్సార్ అనుచరులను ఒకేలా ప్రసన్నం చేసుకునే దిద్దుబాటు చర్యలకు ఆయన శ్రీకారం చుట్టారని అంటున్నఏపీలో షర్మిల రాజ్యసభ సీటు మిస్ అవ్వడం కూడా జగన్-కాంగ్రెస్ సాన్నిహిత్యానికి మార్గం సుగమం చేస్తోందనే వాదన ఉంది. ఒకవేళ షర్మిలను కాంగ్రెస్ అధిష్ఠానం పార్లమెంట్కు పంపి ఉంటే, జగన్ కాంగ్రెస్ వైపు చూడటం అసాధ్యమయ్యేది. కానీ ఇప్పుడు మారిన సమీకరణాల్లో జగన్ కేంద్రంపై ఒత్తిడి పెంచుతూనే, కాంగ్రెస్తో ఫ్రెండ్షిప్కు సై అంటున్నట్లు సంకేతాలు ఇస్తున్నారు. మొత్తానికి ఏపీలో జగన్ వేస్తున్న అడుగులు.. తెలంగాణలో రేవంత్ రెడ్డి రాస్తున్న పొలిటికల్ స్క్రిప్ట్లు రెండూ ఒకదానికొకటి ముడిపడి సాగుతున్నాయి. ఇరు రాష్ట్రాల సరిహద్దుల్లో రేవంత్ రెడ్డి నడుపుతున్న ఈ మైండ్ గేమ్ రాబోయే రోజుల్లో కాంగ్రెస్ను ఏ తీరానికి చేరుస్తుందో చూడాలి.

==============================

## సోదరి కలిపించడంలేదు రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్మన్ పిర్యాదు

హైదరాబాద్ జూన్ 15

మాజీ మేయర్, తెలంగాణ మహిళా కమిషన్ చైర్మన్ గద్వాల విజయలక్ష్మి తన సోదరి కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేసారు. బంజారాహిల్స్ రోడ్ నంబర్ 12లో నివసించే తన సోదరి కె.నమ్రత(57) ఈ నెల 4వ తేదీన ఉదయం 10 గంటలకు ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటికి వెళ్లి తిరిగి రాలేదని విజయలక్ష్మి ఫిర్యాదులో పేర్కొన్నారు. సతీష్(35), సత్యనారాయణ(45), కుమారి(45) అనే ముగ్గురు వ్యక్తులపై అనుమానం ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. బంజారా హిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## నా కోరిక తీరిస్తేనే సినిమాల్లో ఛాన్స్

హైదరాబాద్ జూన్ 15

కొన్నేళ్లుగా సినీ రంగంలో ఉన్న ఓ యువనటి(21)కి ఓ సినిమాలో హీరోయిన్ స్నేహితురాలి పాత్ర ఇప్పిస్తానని ప్రసాద్ అనే క్యాస్టింగ్ ఆర్టిస్ట్ సంప్రదించాడు. 2025 అక్టోబర్ నుండి డిసెంబర్ వరకు ఈ సినిమా షూటింగ్ పూర్తవగా, నటికి ఇవ్వాల్సిన రూ.90 వేల పారితోషికం, రూ.38 వేల ప్రయాణ చార్జీలు ఇవ్వకుండా ప్రసాద్ తప్పించుకున్నాడు. ఈ ఏడాది ఫిబ్రవరి 18వ తేదీన తనను కలవమని చెప్పి, బలవంతంగా కారులో ఎక్కించుకుని, తన కోరిక తీరిస్తే ఇతర సినిమాల్లో అవకాశాలు ఇప్పిస్తానని సదరు నటిపై లైంగిక దాడికి ప్రయత్నించాడు. నిందితుడి నుండి తప్పించుకుని, జరిగిన విషయాన్ని తన తల్లికి చెప్పడంతో, ప్రసాద్ను బాధితురాలి తల్లి నిలదీసింది. దీంతో ప్రసాద్ బాధితురాలి తల్లిని కూడా దూషించడంతో, పోలీసులకు ఫిర్యాదు చేసారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేసారు.

## నెలవాయి గ్రామంలో విషాదం

చిత్తూరు జూన్ 15

నెలవాయి గ్రామం పారంపండ్ గుంతలో ఈత నేర్చుకోవడానికి వెళ్లిన కుమారుడు, తల్లి మృతి చెందారు. తల్లి రేవతి (35), కుమారుడు సిద్దు(15) మృతి చెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది. ఉపాధి హామీ పథకంలో చేపట్టిన గుంతలో ఈత నేర్చుకోవడానికి సిద్దు వెళ్లాడు. నీటిలో మునిగిన కుమారుడుని కాపాడబోయి తల్లి, కుమారుడు ఇద్దరు మృతి చెందారు.

# నిధుల్లేక నీరసిస్తున్న పాఠశాల పనులు

నల్గొండ, జూన్ 15, తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠా త్మకంగా చేపట్టిన 'మన ఊరు - మన బడి' బిల్లుల చెల్లింపులో తీవ్ర జాప్యం జరుగుతోంది. గత ప్రభుత్వ హయాం లో చేసిన పనులకు సంబంధించి రూ. 300 కోట్లకు పైగా చెల్లించాల్సి ఉంది. ప్రతి నెలా రూ.50 కోట్ల చొప్పున విడుదల చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ సర్కార్.. గత ఏప్రిల్ నెలలో మాత్రమే రూ.50 కోట్లు చెల్లించింది. విడుదల చేసిన దాంట్లోనూ రూ. 46 కోట్లు ఓ పెద్ద కంపెనీకే ఇచ్చిందని చిన్న కాంట్రాక్టర్లు చెబుతున్నారు. పను లు చేపట్టి మూడేళ్లవుతున్నా బిల్లులు రాకపోవడంతో చిన్న కాంట్రాక్టర్ల పరిస్థితి దయనీయంగా మారింది. బీఆర్ఎస్ హయాంలో మన ఊరు - మన బడి కార్యక్రమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 9 వేల ప్రభుత్వ పాఠశాలల ఆధునీకరణ, నిర్మాణ పనులు చేపట్టింది. దాదాపు వెయ్యి మంది కాం ట్రాక్టర్లు ఈ పనులు చేశారు. డైనింగ్ హాల్, మ రుగుదొడ్ల నిర్మాణం, కాంపౌండ్ వాల్, ఎలక్ట్రికల్ వంటి మైనర్ పనులను చిన్న కాంట్రాక్టర్లు అప్పగించగా, పేయంటింగ్, స్మార్ట్ క్లాస్లకు సంబంధించి డిజిటల్ బోర్డులు ఏర్పాటు తదితర పెద్ద పనులను ఓ బడా కంపెనీకి ఇచ్చారు. వెయ్యి మంది కాంట్రాక్టర్లలో రూ.10 లక్షల లోపు పనులు చేసిన వారు 600 మంది వరకు ఉంటారు.ఇందులో రూ.5 లక్షల లోపు పనులు చేసిన వాళ్లకు దాదాపు రూ.141 కోట్లు, రూ.5- 10 లక్షల లోపు రావాల్సిన బిల్లులు రూ.75 కోట్లు, రూ.10-30 లక్షల లోపు రూ.75 కోట్లు, రూ.30 లక్షలకు పైగా రావాల్సిన బిల్లులు రూ. 50 కోట్లకుపైగా ఉంటాయి. మొత్తం కలిపి చిన్న కాంట్రాక్టర్లకు రూ.350 కోట్ల వరకు చెల్లించా ల్సి ఉంది. ఇందులో రూ.50 కోట్లు విడుదల చేయగా ఇంకా రూ.300 కోట్లు చెల్లించాల్సి ఉం ది. బడా కంపెనీలకు రూ.650 కోట్లకు దాదాపు క్లియర్ చేసినట్లుగా ఓ కాంట్రాక్టర్ తెలిపారు. అప్పులు చేసి మరీ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించామని, బిల్లులు రాకపోవడంతో వడ్డీ భారం పెరుగుతుందని చిన్న కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకేసారి రూ.100 కోట్లు చెల్లిస్తే మైనర్ పనులు చేసిన వారి సమస్యలు పరిష్కారమవుతాయని అంటున్నారు. రూ.5 లక్షల లోపు బిల్లులకు కూడా మూడేళ్లుగా ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. పెద్ద కాంట్రాక్టర్లకు దాదాపు 99 శాతం బిల్లులు క్లియర్ చేసిన ప్రభుత్వం.. తమకు రేపుమాపు అంటూ కాలయాపన చేస్తుందని అంటున్నారు. ప్రభుత్వాన్ని బిల్లులు అడిగితే డబ్బుల్లేవు, ఉన్నప్పుడు ఇస్తామని అంటుంది. ఎప్పుడు అడిగినా ఇదే మాట చెబుతుంది. గత ప్రభుత్వంలో కూడా బిల్లుల చెల్లింపులో ఇబ్బందులు ఉన్నప్పటికీ.. ఈ ప్రభుత్వంలో పరిస్థితి దారుణంగా ఉంది. ప్రతి నెలా రూ.50 కోట్ల చొప్పున విడుదల చేస్తానని గత ఏప్రిల్ నెలలో మాత్రమే రూ.50 కోట్లు ఇచ్చింది. ఇందులోనూ 90 శాతం వరకు ఓ బడా కంపెనీకే పోయాయి.

# బంజారాహిల్స్ టూ పీవీఎక్స్ ప్రెస్ హైవే

హైదరాబాద్ జూన్ 15

హైదరాబాద్ నగరంలో రోజురోజుకూ పెరుగుతున్న వాహనాల రద్దీకి అనుగుణంగా కీలక కారిడార్లను అభివృద్ధి చేసేందుకు హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ సరికొత్త మౌలిక వసతుల ప్రాజెక్టును తలపెట్టింది. ప్రధాన నగరం నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి ప్రయాణం సాఫీగా సాగేలా సరికొత్త ఫ్లైఓవర్ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేసింది. బంజారాహిల్స్ రోడ్డు నంబరు 1లోని జీవీకే వన్ మాల్ వద్ద ప్రారంభమై.. మాసబ్ట్యాంక్ మీదుగా ప్రస్తుతం ఉన్న పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్‌వేకు అనుసంధానం చేసేలా సుమారు 4 కిలోమీటర్ల పొడవైన పైవంతెనను నిర్మించనున్నారు. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు సంబంధించి హెచ్ఎండీఏ ఇప్పటికే క్షేత్రస్థాయి సర్వే పనులను ప్రారంభించింది. రానున్న రెండేళ్ల కాలంలోనే ఈ కారిడార్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు అధికారులు ముమ్మర కసరత్తు చేస్తున్నారు. ప్రస్తుతం నగరం నుంచి ఎయిర్‌పోర్టుకు వేగంగా చేరుకోవడానికి పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్‌వే అందుబాటులో ఉన్నప్పటికీ ప్రధాన నగరం నుంచి ఆ ఎక్స్‌ప్రెస్‌వేను చేరుకోవడమే ప్రయాణికులకు పెద్ద నరకంగా మారింది. ముఖ్యంగా రద్దీ వేళల్లో బంజారాహిల్స్ రోడ్డు నంబరు 1, జీవీకే మాల్, తాజ్‌కృష్ణ, కేర్ ఆసుపత్రి, మాసబ్ట్యాంకు జంక్షన్లను దాటడానికి వాహనదారులకు చుక్కలు కనిపిస్తున్నాయి. కొన్నిసార్లు ఈ కొద్దిపాటి దూరం దాటడానికే గంటల కొద్దీ సమయం పడుతుండటంతో విమాన ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో కొత్త ఫ్లైఓవర్ అందుబాటులోకి వస్తే బంజారాహిల్స్, మాసబ్ట్యాంక్ వైపు ఇరువైపులా ట్రాఫిక్ సమస్యకు పెద్ద ఊరట లభించనుంది. బేగంపేట, సోమాజిగూడ నుంచి వచ్చే వాహనదారులు పంజాగుట్ట ఫ్లైఓవర్ ద్వారా నేరుగా ఈ కొత్త జీవీకే ఫ్లైఓవర్ ఎక్కి ఎక్కడా ఆగాల్సిన అవసరం లేకుండా ఆరాంఘర్ జంక్షన్‌కు, అక్కడి నుంచి నేరుగా ఎయిర్‌పోర్టుకు చేరుకోవచ్చు. ఈ ఫ్లైఓవర్ నిర్మాణంలో భాగంగా ప్రయాణికుల సౌకర్యార్థం వ్యూహాత్మక ర్యాంపులను డిజైన్ చేస్తున్నారు. బంజారాహిల్స్ రోడ్డు నెంబరు 12 ప్రాంతంలో ఒక డౌన్ ర్యాంపును నిర్మించనున్నారు. ఇది ఎయిర్‌పోర్టు వైపు నుంచి వచ్చే వాహనాలు రోడ్డు నంబరు 10, 12 వైపు వెళ్లేందుకు ఉపయోగపడుతుంది. అలాగే ఖైరతాబాద్, సోమాజిగూడ నుంచి చింతల్‌బస్తీ మీదుగా రోడ్డునంబర్ 12 వైపు వెళ్లే వాహనాల కోసం చింతల్‌బస్తీ జంక్షన్ వద్ద ప్రధాన ఫ్లైఓవర్ కింద నుంచి మరో చిన్న పైవంతెన నిర్మించాలని అధికారులు యోచిస్తున్నారు. ఇక లక్డీకపూల్, మాసబ్ట్యాంక్ జంక్షన్ వైపు నుంచి వచ్చే వాహనాలు కొత్తగా నిర్మించే ఫ్లైఓవర్ పైకి సాఫీగా వెళ్లేందుకు వీలుగా ఎన్ఎండీసీ భవనం ముందు ఒక అప్ ర్యాంపును ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక త్వరలోనే సిద్ధం కానుందని హెచ్ఎండీఏ చీఫ్ ఇంజినీర్ రవీందర్ తెలిపారు. డీపీఆర్ రూపకల్పన పూర్తయిన తర్వాత ప్రాజెక్టుకు అయ్యే మొత్తం వ్యయం, భూసేకరణ అవసరాలు, ఇతర సాంకేతిక అంశాలపై పూర్తి స్పష్టత వస్తుందని ఆయన పేర్కొన్నారు. నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ కష్టాలను శాశ్వతంగా దూరం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ పైవంతెన నిర్మాణానికి కృతనిశ్చయంతో ఉందని, నిధుల కొరత లేకుండా వేగంగా పనులు పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. ఈ ఫ్లైఓవర్ పూర్తయితే ఎయిర్‌పోర్ట్ ప్రయాణికులతో పాటు పశ్చిమ హైదరాబాద్ ప్రజలకు సైతం ఎంతో వెసులుబాటు లభిస్తుంది.

# ఆధ్యాత్మికం పేరుతో గుంటనక్కల సభ

## భూమన కరుణాకరరెడ్డి, టిటిడి మాజీ ఛైర్మన్

తిరుపతి జూన్ 15

టిడిపి అనుబంధ సంస్థ సాధు పరిషత్ ఒక కార్యక్రమం నిర్వహించారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి పైన, మా నాయకుడు జగన్మోహన్ రెడ్డి పై,నాపైన అనుచిత వాఖ్యలు చేశారు. టిడిపి నాయకులు కంటే దిగజారి కాషాయ వస్త్రాలు ధరించారని టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి ఆరోపించారు.

సాధు పరిషత్ అట్లూరి నారాయణ పనులన్నీ శృంగార పారాయణమే, బూతు సినిమాలు. సాయి భక్తి సంఘానికి కసాయివాడు ఐతే ఎలా ఉంటుందో హిందూ సంఘాలు అధ్యక్షుడు ఐతే ఇలానే ఉంటుంది. శ్రీనివాస సరస్వతి..మైనర్ బాలికను అత్యాచారం చేశాడని శ్రీకాకుళం లో కేసు వుంది. ఈ శ్రీను గురించి శ్రీకాకుళం జిల్లాలో ఎవరిని అడిగినా చెప్తారు. పేరులో తప్పు..బుర్రలో సరస్వతి లేని వాడు శ్రీను , స్వామీజీ ముసుగు లో వేషాలు వేస్తున్నాడు. ఆధ్యాత్మికం పేరుతో గుంటనక్కల సభ జరిగింది. హిందూ బంధువులు రావాలని.. ఈ రాబందులు అంతా తిరుపతి లో వాలిపోయారు. మారీచుడు జింక వేషంలో వచ్చినట్లు..స్వామీజీలు నిరసన ర్యాలీ లో పాల్గొన్నారు. శ్రీవారి సేవకులు ను టిడిపి జెండాలు మోసే కూలీలుగా మార్చి ప్రదర్శన చేశాడు. వీళ్లు సాధువులు కాదు..రాక్షస డి.ఎన్. ఏ కల్గిన ఒకే నక్షత్రంలో పుట్టిన పరమ నికృష్టులు. సన్యాసులు ఉండండి సన్నాసి వెధవలు గా మారకండని అన్నారు.

సనాతన హైందవ ధర్మం కాపాడింది వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాలనలో.. కాషాయ రాక్షసులు వీళ్ళు, వేయి కాళ్ళ మండపం కూల్చిన చంద్రబాబు వీళ్లకు ఇంద్రుడు గా కనిపిస్తున్నారు. హైందవ గర్జన..స్వాములు ముసుగు వేసుకున్న పచ్చ జెండాలు మోసే నక్క ఊళ. రెండు కొండలు ను ఏడు కొండలు గా జీవో ఇచ్చిన మహనీయుడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి . నిత్యం గోవింద నామ స్మరణ తో మార్మోగేల వైఎస్ రాజశేఖర్ రెడ్డి అఖండ హరినామ సంకీర్తన ప్రారంభించారు. జగద్గురు స్వామీజీలు తో తిరుమలలో సమావేశం నిర్వహించిన ఘనత వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాలనలో జరిగింది. వేద విశ్వ విద్యాలయం, చతుర్ముఖ రథాలు రాష్ట్రం నలుదిక్కులు హిందూ మతం ప్రచారం చేశారు వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాలనలో . ఎస్వీ బిసి భక్తి ఛానెల్ తీసుకు వచ్చింది వైఎస్ రాజశేఖర్ రెడ్డి. గోమాతకు పూజ చేసిన తర్వాత శ్రీవారి దర్శనం కు వెళ్ళాలి అని అలిపిరి వద్ద ప్రారంభించారు వైఎస్ జగన్మోహన్ రెడ్డి. శ్రీనివాస దివ్యహోమాన్ని ప్రారంభించింది వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాలనలో. నవనీత సేవ తీసుకు వచ్చింది వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాలనలో..కొండపై దళాలూరులు ఉండకుండా తరిమివేసి, హైందవ ధర్మం కాపాడారని అన్నారు.

టివి5 చైర్మన్ బి.ఆర్ నాయుడు హయంలో దైవ నామ దయ్యాల భజన ప్రారంభం అయ్యింది,బొంకు.. రాంకు నాయుడు ఈ బి.ఆర్ నాయుడు. హిందూ ముసుగు వైఎస్ రాజశేఖర్ రెడ్డి,జగన్ మోహన్ రెడ్డి పై విష ప్రచారం చేయిస్తున్నాడు బి.ఆర్ నాయుడు . బి.ఆర్ నాయుడు బిగి కౌగిలి సడలింపు దేశం మొత్తం చూసింది. పది లక్షలు డొనేషన్లు కూడా తీసుకునే చివరి టిటిడి చైర్మన్ బి.ఆర్ నాయుడు. పోలీస్ 30 యాక్ట్ పేరుతో అనుమతి ఇవ్వని పోలీసులు, దొంగ స్వామీజీలు యాత్రకు ఎలా అనుమతి ఇచ్చారు. వాళ్లపై ఎందుకు కేసులు పెట్టలేదు. పేదలు కోసం నిరసనగా వెళ్తే 150 మంది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పై కేసులు పెట్టారు. బ్లాక్ లో టికెట్లు అమ్ముకునేందుకు అనుమతి ఇస్తే రామ రాజ్యం వస్తుందా. వీళ్ళను కట్టడి చేసి నందుకు మాది రాక్షస రాజ్యం అంటున్నారు. ధర్మ ప్రచారం ఎక్కడైనా జరుగుతుందా . ఈ విధంగా టిడిపి ప్రచారం మొదలు పెట్టాడు బి.ఆర్ నాయుడని అన్నారు.

# జర్మన్ భాషా ప్రావీణ్యంతో అంతర్జాతీయ ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలి: మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి

హైదరాబాద్ జూన్ 15



జర్మన్ భాష నేర్చుకోవడంలో క్రమశిక్షణ, నిరంతర సాధనే విజయానికి మార్గమని రాష్ట్ర మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. విదేశీ భాషల్లో ప్రావీణ్యం సాధించడం ద్వారా యువత అంతర్జాతీయ స్థాయిలో లభించే ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవచ్చని ఆయన అన్నారు.

హైదరాబాద్లోని టామ్కామ్ (టాఓఅూఓ) కార్యాలయంలో జర్మన్ భాషా శిక్షణ పొందుతున్న విద్యార్థులు, అధ్యాపకులతో మంత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్మనీలో ఉద్యోగ అవకాశాలను లక్ష్యంగా పెట్టుకున్న యువత కోసం టామ్కామ్ ఆధ్వర్యంలో జర్మన్ భాషా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నర్సింగ్, ఇంజినీరింగ్ తదితర రంగాల్లో జర్మనీలో మంచి వేతనాలతో కూడిన ఉపాధి అవకాశాలు అందుబాటులో ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. కొత్త భాషను నేర్చుకుని జర్మనీ వంటి అభివృద్ధి చెందిన దేశాల్లో ఉద్యోగాలు సాధించడం యువతకు గొప్ప అవకాశమని అన్నారు. ఇటీవల మందమర్రిలో ప్రారంభించిన జర్మన్ భాషా శిక్షణ తరగతులకు విశేష స్పందన లభించిందని తెలిపారు. మందమర్రి కేంద్రంలో ఇప్పటికే సుమారు 200 మంది యువత జర్మన్ భాషా కోర్సులో చేరినట్లు వెల్లడించారు.

విద్యార్థుల హాజరును నిరంతరం పర్యవేక్షిస్తూ శిక్షణ నాణ్యతను మరింత మెరుగుపరుస్తున్నామని చెప్పారు. విదేశీ ఉద్యోగాలను పొందడంలో భాషా ప్రావీణ్యమే ప్రధాన అడ్డంకిగా మారుతోందని, దానిని అధిగమించేందుకు విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు ఒక్క తరగతిని కూడా మిస్ కాకుండా క్రమం తప్పకుండా హాజరై భాషపై పూర్తి పట్టు సాధించాలని సూచించారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో శిక్షణ పొందితే ఉన్నత స్థాయి భాషా నైపుణ్యాలను సులభంగా సాధించగలరని పేర్కొన్నారు. ఏ భాషనైనా నేర్చుకోవాలంటే నిరంతర అభ్యాసమే విజయానికి మూలమని మంత్రి స్పష్టం చేశారు. ఇటువంటి భాషా శిక్షణ కార్యక్రమాలు యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలను కల్పించడంతో పాటు అంతర్జాతీయ స్థాయిలో విజయవంతమైన కెరీర్ నిర్మాణానికి దోహదపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

# పాలసీలు చేయాల్సిన ప్రభుత్వ పెద్దలు కార్మికులను మభ్య పెట్టే ప్రయత్నం

## సింగరేణికి బకాయి ఉన్న రూ. 50 వేల కోట్లను వెంటనే చెల్లించాలి

## బొగ్గుబాయి పర్యటన లో కవిత

మందమర్రి జూన్ 15

తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత సోమవారం మందమర్రిలో పర్యటించారు. బొగ్గుబాయి" కార్యక్రమంలో భాగంగా కాసిపేట మైన్ 1 పరిశీలించి కార్మికులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పాలసీలు చేయాల్సిన సీఎం, డిప్యూటీ సీఎం లే వినతి పత్రాలిస్తూ సింగరేణి కార్మికులను మభ్య పెడుతున్నారని ఆరోపించారు. డిపెండెంట్ ఉద్యోగాలతో సహా అన్నింటిలో కార్మికులకు అన్యాయం చేస్తున్నారు. కార్మికులకు హెచ్ఎంఎస్, టీఆర్ఎస్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

కవిత మాట్లాడుతూ తెలంగాణ లో కొత్త రాజకీయ శక్తిగా వచ్చాం. సింగరేణి బిడ్డల ఆశీర్వాదం కోసం ఇక్కడకు వచ్చాను. తెలంగాణ ఉద్యమంలో కలిసి పనిచేశాం, బీఆర్ఎస్ ప్రభుత్వంలోనూ కలిసి పనిచేశాం. నేను ఎక్కడ ఉన్న కూడా అనునిత్యం మీ పక్కనే ఉండి పోరాటం చేశాను. సింగరేణిలోని మెడికల్ బోర్డు పెట్టకపోతే హైదరాబాద్ లోని సింగరేణి భవన్ ను ముట్టడించాం. ఈ ప్రభుత్వంలో సర్వసామాన్యంగా జరగాల్సిన పనులకు కూడా పోరాటం చేయాల్సి వస్తోందని అన్నారు.

హైదరాబాద్, ఢిల్లీలో ఉండి మనకు బొగ్గు బావులు తేవాల్సిన సీఎం, డిప్యూటీ సీఎం లు మీకే వినతి పత్రాలు ఇస్తున్నారు. మనకు ఐటీ సమస్య లేకుండా, నెలకు రెండుసార్లు మెడికల్ బోర్డు పెట్టాల్సిన పనులు ఈ ప్రభుత్వం చేయటం లేదు. చేయాల్సిన పనులు చేయకుండా ఇక్కడకు వచ్చి కార్మికులను మభ్య పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. కానీ కార్మికులతో నిరంతరం ఉండి ఎవరు పోరాటం చేస్తారో మీ అందరికీ తెలుసు. మనకు ముఖ్యంగా హక్కుగా రావాల్సిన డిపెండెంట్ ఉద్యోగాల కోసం పోరాటం చేయాల్సి ఉంది. సింగరేణికి బొగ్గు బావులు తెచ్చుకుంటే దాదాపు లక్ష ఉద్యోగాలు ఇవ్వవచ్చు. కానీ అన్నింటినీ ప్రైవేట్ పరం చేయాలని, అండర్ గ్రౌండ్ మైనింగ్ ను రద్దు చేయాలని ప్రయత్నిస్తున్నారు. టీఆర్ఎస్ కార్మికుల కోసం హెచ్ఎంఎస్ తో కలిసి పోరాటం చేస్తుంది. రానున్న ఏ ఎన్నికల్లోనైనా, పోరాటాల్లోనైనా హెచ్ఎంఎస్ తో కలిసి టీఆర్ఎస్ సంయుక్తంగా పోరాడుతుందని అన్నారు.

హెచ్ఎంఎస్ అధ్యక్షులు రియాజ్ ఎక్కడ కాంప్రమైజ్ కాకుండా పోరాటం చేస్తున్న సంగతి మీకు తెలిసిందే. మనకు ఢిల్లీ స్థాయిలో పనులు కావాలంటే జేబీసీసీ లో మనం పోరాడాలి. రియాజ్ అందులో సభ్యులుగా ఉండి సింగరేణి కార్మికుల కోసం పోరాటం చేస్తున్నారు. పాలసీలు చేయాల్సిన ప్రభుత్వ పెద్దలు కార్మికులను మభ్య పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. నిజానికి సింగరేణిని కాపాడాలనే చిత్తశుద్ధి ఉంటే సింగరేణికి బకాయి ఉన్న రూ. 50 వేల కోట్లను వెంటనే చెల్లించాలి. వారం రోజుల పాటు బాయి బాట కార్యక్రమం ఉంటుంది. కాసిపేట నుంచే బాయి బాట కార్యక్రమం మొదలుపెట్టాం. ఓపెన్ కాస్ట్ మైనింగ్ పెంచే ప్రయత్నం చేస్తున్న



సింగరేణి కార్మికుల భద్రతను పట్టించుకోవటం లేదని అన్నారు.

ఇప్పుడున్న కార్మికుల్లో చాలా మంది యువ వయసు వాళ్లు ఉన్నారు. వారి పిల్లలు చదువుకునేందుకు సరైన స్కూల్స్, సరైన హాస్పిటల్స్ లేవు. అన్నింటిల్లో ప్రైవేట్ ను తీసుకొచ్చి వైద్యాన్ని మరింత ఖరీదు చేసే ప్రయత్నం చేస్తున్నారు. అందుకే తెలంగాణ రక్షణ సేన పాంచజన్యం అనే ఐదు కీలక అంశాలతో ముందుకు వచ్చింది. కార్పొరేట్ స్థాయి విద్య, వైద్యాన్ని పూర్తిగా ఉచితంగా మేము అందజేస్తాం. ఈ ప్రభుత్వం ఇవ్వగలిగే స్థాయిలో ఉండి ఇవ్వటం లేదు. టీఆర్ఎస్ పెట్టిన తర్వాత సింగరేణిలో నా మొదటి యాత్ర ఇది. మా పార్టీకి సింగరేణి కార్మికుల దీవెనార్తి ఉండాలని కోరుకుంటున్నానని అన్నారు.

# రాజకీయ వత్తిళ్లకు లొంగొద్దు...అవినీతికి పాల్పడవద్దు

## నూతన ఐపీఎస్, ఐఏఎస్ అధికారులకు సూచన

సికింద్రాబాద్ జూన్ 15 రాజకీయ వత్తిళ్లకు లొంగొద్దని, అవినీతికి పాల్పడవద్దని నూతన ఐపీఎస్, ఐఏఎస్ అధికారులకు రాష్ట్ర బీసీ సంక్షేమ, అభివృద్ధి శాఖ సలహాదారు వీ హనుమంతరావు, మాజీ ఐఏఎస్ అధికారి గోపాల కృష్ణ నాయుడు తెలిపారు. ఆల్ ఇండియా తెలగ కాపు బలిజ సంఘం ఆధ్వర్యంలో సికింద్రాబాద్ లోని సప్తగిరి హోటల్ లో కాపు సామాజిక వర్గానికి చెందిన పారిశ్రామిక వేత్తలను, నూతనంగా సివిల్ సర్వీస్ లో ప్రతిభను కనబరిచి ఉద్యోగాలు పొందిన వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వీహెచ్ మాట్లాడుతూ తల్లిదండ్రులను, పెద్దలను గౌరవించాలని, మంచి పనులు చేస్తూ కుటుంబానికి, సమాజానికి ఆదర్శంగా నిలవాలని కాపు అధికారులకు సూచించారు.

# భార్య ఆత్మహత్య కేసులో భర్త అరెస్టు

హైదరాబాద్ జూన్ 15

ఆరు నెలల పాపతో మహిళ బిల్డింగ్ పైనుండి దూకి ఆత్మహత్య చేసుకున్న కేసులో భర్తను రిమాండ్ కు తరలించారు. మియాపూర్లో మయూరి నగర్ పరిధిలోని ఓ అపార్ట్మెంట్లో నివసిస్తూ, తన ఆరు నెలల పాపతో ఆరవ అంతస్తు నుండి దూకి ఈషా సాహు(37) అనే మహిళ ఆత్మహత్య చేసుకుంది. రెండో కూతురు పుట్టిందని భర్త భూపేంద్రసాహు వేధించడమే కారణమని మృతురాలి తల్లిదండ్రులు ఫిర్యాదు చేసారు. మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి భర్తను అరెస్ట్ చేసి రిమాండ్కు తరలించారు. ప్రమాదంలో తల్లి అక్కడికక్కడే మృతిచెందగా, పాప గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది.

==========================

# ప్రజావాణి దరఖాస్తులను వెంట వెంటనే పరిష్కరించాలి: జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్ జిల్లా ప్రతినిథి, జూన్ 15(భారత శక్తి )ప్రజావాణి దరఖాస్తులను వెంటవెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.

సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఆయన స్వయంగా స్వీకరించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆయా శాఖల అధికారులు ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు.

ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా, ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను కలెక్టర్ కు సమర్పించారు.

ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, డిఆర్ఓ రాథోడ్ రమేష్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ప్రీ-ప్రైమరీ ఇన్స్ట్రక్టర్, ఆయా పోస్టుల తాత్కాలిక మెరిట్ జాబితా విడుదల

## అభ్యంతరాల స్వీకరణకు నేడు సాయంత్రం 4 గంటల వరకు గడువు: జిల్లా విద్యాధికారి బి. భోజన్న



నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 15 (భారత శక్తి): జిల్లాలో 2026-27 విద్యా సంవత్సరంలో ప్రారంభించనున్న 74 ప్రీ-ప్రైమరీ (పూర్వ ప్రాథమిక) పాఠశాలల్లో ఇన్స్ట్రక్టర్ మరియు ఆయా పోస్టుల భర్తీకి సంబంధించిన తాత్కాలిక మెరిట్ జాబితాను జిల్లా విద్యాశాఖ విడుదల చేసింది. ఈ జాబితాను జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో పరిశీలించడంతో పాటు, జిల్లా విద్యాశాఖ అధికారిక వెబ్‌సైట్‌లో కూడా అందుబాటులో ఉంచినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి దర్శనం భోజన్న తెలిపారు. తాత్కాలిక మెరిట్ జాబితాపై ఏవైనా అభ్యంతరాలు ఉన్న అభ్యర్థులు తమ రుజువులతో కూడిన రాతపూర్వక వినతులను రేపు సాయంత్రం 4 గంటలలోపు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. నిర్దేశిత గడువు అనంతరం వచ్చే అభ్యంతరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ స్వీకరించబోమని స్పష్టం చేశారు. అభ్యంతరాల పరిశీలన పూర్తయిన అనంతరం తుది మెరిట్ జాబితాను ప్రకటించి, తదుపరి నియామక ప్రక్రియను చేపట్టనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి వెల్లడించారు.

# నూతన విద్యా సంవత్సరంలో ఉన్నత లక్ష్యాలు సాధించాలి: జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య

మంచిర్యాల ప్రతినిధి, జూన్ 15 (భారతశక్తి):



నూతన విద్యా సంవత్సరంలో ఉన్నత లక్ష్యాలు సాధించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. సోమవారం 2026-27 విద్యా సంవత్సరం తొలిరోజు సందర్భంగా జిల్లాలోని జైపూర్ మండలం ఇందారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ముందుగా విద్యార్థులకు నూతన విద్యా సంవత్సరం శుభాకాంక్షలు తెలుపుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. విద్యను జీవితంలో అత్యంత విలువైన ఆస్తిగా భావించి కష్టపడి చదివి ఎంచుకున్న లక్ష్యాలను సాధించాలని తెలిపారు. పాఠశాలలోని తరగతి గదులు, గ్రంథాలయం, సైన్స్ ప్రయోగశాలలు, కంప్యూటర్ ల్యాబ్, క్రీడా గది తదితర సౌకర్యాలను పరిశీలించి విద్యార్థులకు అందిస్తున్న విద్యా వాతావరణం, మౌలిక వసతుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రంథాలయాన్ని సందర్శించి విద్యార్థులు ప్రతిరోజూ పుస్తక పఠనానికి సమయం కేటాయించాలని, పాఠ్యపుస్తకాలతో పాటు సాధారణ విజ్ఞానం, స్ఫూర్తిదాయక వ్యక్తుల జీవిత చరిత్రలు, సాహిత్య పుస్తకాలు చదవడం ద్వారా జ్ఞానాన్ని విస్తరించుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలలో నాణ్యమైన విద్యతో పాటు ఆధునిక సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని, విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకుని పోటీ ప్రపంచంలో రాణించేందుకు సిద్ధం కావాలని తెలిపారు. అనంతరం ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు అందజేశారు. విద్యా సంవత్సరపు మొదటి రోజు నుంచే క్రమశిక్షణతో చదువుపై దృష్టి సారించాలని, ప్రతి రోజు నేర్చుకునే అలవాటు పెంపొందించుకోవాలని తెలిపారు. విద్యతో పాటు క్రీడలు, సహపాఠ్య కార్యకలాపాలలో పాల్గొని వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి, మండల విద్యాధికారి, పంచాయతీ కార్యదర్శి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సర్పంచ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ ఆ హామీలు తీరిస్తే రాజకీయం వదిలేస్తా:కేటీఆర్



జనగామ(భారత శక్తి)జూన్ 15:

రేవంత్ రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టి రెండున్నరేళ్లయినా ఒక్క పని పూర్తి చేయలేదని మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు. ఖైరతాబాద్‌లో ఎస్ఐఆర్ పై నిర్వహించిన శిక్షణ, అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతూ రేవంత్ ప్రభుత్వం గరీబోళ్ల పొట్ట కొట్టిందని, హైడ్రా పేరుతో వందల ఇళ్లను కూలగొట్టి కుటుంబాలను రోడ్డున పడేశారని, ఆడబిడ్డలకు నెలకు రూ. 2500 ఆర్థిక సహాయం బాకీలతో సహా లక్షన్నర రూపాయలు ఇస్తే, రాజకీయాల నుంచి తప్పుకుంటానని కేటీఆర్ సంచలన ప్రకటన చేశారు.

# వాసవీయుల సేవా హస్తం -- అమావాస్య మహా అన్నదానం

## వాసవి క్లబ్ ఆధ్వర్యంలో అమావాస్య అన్నదానం





మంచిర్యాల ప్రతినిధి, జూన్ 15 (భారత శక్తి): మంచిర్యాల వాసవి క్లబ్ ఆధ్వర్యంలో అమావాస్య సందర్భంగా మంచిర్యాల ఐబి చౌరస్తాలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. దాత మహాజన్ రూపాలి రఘునందన్ దంపతుల సహకారంతో ప్రతినెల నిర్వహించే అమావాస్య అన్నదానంలో భాగంగా దాదాపు 500 పైగా నిరుపేదలకు అన్నప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ జిల్లా క్యాబినెట్ సెక్రెటరీ సేవా కేశెట్టి వంశీకృష్ణ, జోన్ చైర్ పర్సన్ లు పడకంటి శ్రీనివాస్, ఇరుకుల్ల సూర్యనారాయణ, వాసవి క్లబ్ కార్యదర్శి గుండా మనోహర్, నస్పూర్ మండల్ వాసవి క్లబ్ కార్యదర్శి తోట రాజయ్య, కోశాధికారి చందూరి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

--- వాసవి యూత్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం

పట్టణము లోని విశ్వనాథ స్వామి దేవాలయంలో ప్రతినెల అమావాస్య రోజున వాసవి యూత్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారు. దీంట్లో భాగంగా సోమవారం రోజున అప్పాల యశోద జ్ఞాపకార్థశీ కుమారులు కూతుళ్లు అప్పాల లాచయ్య, అప్పాల నాగరాజు - స్వప్న, రవి కుమార్ - రమ్య, సంతోష్ - హారిక, సిరిపురం రజిత - శ్రీనివాస్, ఉత్తురి ధనలక్ష్మి- శ్రీనివాస్, నగిరి కవిత - నరేష్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం చైర్మన్ పడకంటి శ్రీనివాస్, రీజియన్ చైర్మన్ మధు శ్రీ, జోన్ చైర్ పర్సన్ పాత సాయి, వాసవి క్లబ్ యూత్ అధ్యక్షుడు ముక్త విశ్వాస్, కార్యదర్శి బోనగిరి ప్రసన్నకుమార్, కోశాధికారి గందె శ్రీ అనిల్ కుమార్, రీజియన్ సెక్రటరీ తాటిపల్లి సాయివర్ధన్, క్యాబినెట్ జాయింట్ సెక్రెటరీ కాచం సతీష్ , వాసవి యూత్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారి , యూత్ క్లబ్ సభ్యులు పాల్గొనడం జరిగింది.

# పార్టీ కోసం కష్టపడి పని చేసేటోళ్లకే పదవులు.!

**-సాధ్యం కాని హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్**

**-ప్రజాపాలన ప్రభుత్వం వైఫల్యాలను ప్రజా క్షేత్రంలో ఎండగట్టాలి.**

**-బిఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు, ఎస్ఐఆర్ పై విస్తృతస్థాయి సన్నాహక సమావేశంలో**

**ఎమ్మెల్సీ తకెళ్లపల్లి, మాజీ జిల్లా గ్రంథాలయ చైర్మన్ దిండిగెల రాజేంద్రర్, మాజీ ఎమ్మెల్యే రేగా**

మణుగూరు, జూన్ 15 (భారతశక్తి): భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) పార్టీ కోసం పనిచేసేటోళ్లకే పదవులు వరిస్తాయని ఎమ్మెల్సీ తకెళ్లపల్లి రవీందర్, నియోజకవర్గ సభ్యత్వ నమోదు ఇంచార్జి (డిజిటల్) మాజీ జిల్లా గ్రంథాలయ చైర్మన్ దిండిగెల రాజేంద్రర్, మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావులు పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని హనుమాన్ పక్షన్ హాల్లో పినపాక నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తలతో పార్టీ సభ్యత్వ నమోదు, ఎస్ఐఆర్ పై విస్తృతస్థాయి సన్నాహక సమావేశం మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిధులుగా ఎమ్మెల్సీ తకెళ్లపల్లి రవీందర్, నియోజకవర్గ సభ్యత్వ నమోదు ఇంచార్జి (డిజిటల్) దిండిగెల రాజేంద్రర్ పాల్గొని ప్రసంగించారు. పినపాక నియోజకవర్గానికి రేగా కాంతారావు రాష్ట్రంలో ఏ నియోజకవర్గానికి ఇవ్వనన్ని నిధులు పినపాక నియోజకవర్గానికి తీసుకు వచ్చారని ఎమ్మెల్సీ తకెళ్లపల్లి రవీందర్, దిండిగెల రాజేంద్రర్ లు అన్నారు. కాంగ్రెస్ పాలనలో రైతులకు, అన్ని వర్గాల ప్రజలకు కష్టాలే మిగిలాయని, గులాబీ శ్రేణులు ప్రజాపాలన ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టాలని, బిఆర్ఎస్ హయాంలో సాధించిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని పిలుపునిచ్చారు. కెసిఆర్ పాలనలో తెలంగాణ అన్ని రంగాల అభివృద్ధి చెందిందని రైతుబంధు, రైతు బీమా, రైతు భరోసా, కళ్యాణ లక్ష్మి, ఆసరా పెన్షన్లతో పాటు అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు జరగడంతో ప్రజలు సుభిక్షంగా ఉన్నారన్నారని కొనియాడారు. సాధ్యం కానీ హామీలతో ప్రజలను నమ్మించి రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చారని, కాంగ్రెస్ పై ప్రజల్లో వ్యతిరేకత మొదలైందన్నారు. అవినీతి కాంగ్రెస్ ను గద్దెదించే వరకు కార్యకర్తలు సైనికుల పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీ సభ్యత్వ నమోదు పూర్తిగా డిజిటల్ పద్ధతిలో జరుగుతుందని పినపాక నియోజకవర్గంలో ప్రతి ఒక కార్యకర్త సభ్యత్వ నమోదు చేసుకోవాలని, ఎస్ఐఆర్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. బిఆర్ఎస్ పార్టీపై ప్రజల్లో ఆదరణ పెరిగిందని దీనిని అనుకూలంగా మార్చుకొని ఆ దిశగా కలిసికట్టుగా పక్క ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని కెసిఆర్ ను మూడోసారి ముఖ్యమంత్రిని చేసేవరకు కార్యకర్తలు సైనికుల పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, మాజీ మండల నాయకులు, సీనియర్ నేతలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి: జిల్లా కలెక్టర్- తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట (భారత శక్తి ప్రతినిధి) జూన్15:



ప్రజల సమస్యల పరిష్కారమే వేదికగా సాగుతున్న ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో మాట్లాడుతూ, ప్రజలు సమర్పించిన దరఖాస్తులకు ఆయా శాఖలు ఖచ్చితమైన సమాచారాన్ని సంబంధిత ఫార్మేట్ లో అందించాలని, రెసిడెన్షియల్ స్కూల్స్, కాలేజీలలో శానిటేషన్, త్రాగునీరు సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించడానికి జిల్లా అధికారులు, మండల స్పెషల్ ఆఫీసర్లు క్షేత్రస్థాయిలో పర్యటించి వెంటనే చర్యలు చేపట్టాలని, వర్షాకాలం మొదలైనందువలన ప్రకృతి వైపరీత్యాల వలన ఏవైనా అత్యవసర పరిస్థితులు వస్తే డిజాస్టర్ మేనేజ్మెంట్ టీమ్స్ అందుబాటులో ఉంటాయి కావున అధికారులు అప్రమత్తంగా ఉండాలని, రెడ్ క్రాస్ సంస్థలు మానవతా దృక్పథంతో సేవలు అందిస్తున్న అందువలన వారి యొక్క సేవలు మోటివేషన్ చేయటానికి అధికారులు, సంబంధిత శాఖలు కృషి చేయాలని వారి యొక్క సేవలు వినియోగించుకోవాలని అన్నారు, సార్ లో భాగంగా వారికి ఖచ్చితమైన సమాచారాన్ని ఇవ్వాలని అధికారులు అందుబాటులో ఉండాలని, వివిధ శాఖలలో సమీక్ష సమావేశాలు పెండింగ్ లో ఉంటే వెంటనే నిర్వహించుకోవాలని, ఈ యాసంగి సీజన్ లో జిల్లాలో 3 లక్షల 40 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగినదని ధాన్యం కొనుగోలులో సహకరించిన అదనపు కలెక్టర్, సివిల్ సప్లై, డిఆర్డిఏ, మెప్మా, అగ్రికల్చర్ , మండల స్పెషల్ ఆఫీసర్లు, మండల తాసిల్దార్ లు అందరికీ పేరుపేరునా శుభాకాంక్షలు తెలుపుతున్నానని, ధాన్యం కొనుగోలులో ఇంకా ఏమైనా పెండింగ్ ఉంటే వెంటనే పరిష్కరించుకోవాలని కలెక్టర్ అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా మరియు డివిజన్ స్థాయి ప్రజావాణి దరఖాస్తులను తప్పనిసరిగా ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. పాత ప్రజావాణి పోర్టల్‌లో ఇంకా పరిష్కారం కాకుండా ఉన్న దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని, కొత్తగా అందుతున్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. ప్రజావాణికి అన్ని శాఖల డివిజనల్ అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా జిల్లా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. స్థానిక సమస్యలు స్థానికంగానే పరిష్కారమైతే ప్రజలకు ఇబ్బందులు తప్పుతాయని ఆయన పేర్కొన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం లో భూ సమస్యలకి సంబందించి 58 దరఖాస్తులు, డిడబ్ల్యుఓ 10, డీపీఓ 7, ఫిషరీస్ 5, డి ఆర్ డి ఏ 4, మిగిలిన 31 దరఖాస్తులు వివిధ శాఖలకి చెందినవని మొత్తం 113దరఖాస్తులు వచ్చాయాని వాటిని పరిష్కరించేందుకు శాఖల వారీగా పంపించటం జరిగిందని కలెక్టర్ ఈ సందర్భంగా అన్నారు. ప్రజావాణి కార్యక్రమానికి అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, జడ్పీ సీఈవో శిరీష, డిఎంహెచ్ఓ వెంకటరమణ, సిపిఓ కిషన్ నాయక్, డి ఏ ఓ శ్రీధర్ రెడ్డి, డిఇఓ అశోక్ , స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి నరసింహారావు ఇతర జిల్లా అధికారులు తదితరులు హాజరైనారు.

# కరెంట్ షాక్‌తో తండ్రి,కూతురు మృతి అల్వాల్‌లో విషాదం



జనగామ(భారత శక్తి )జూన్ 15:మేడ్చల్ జిల్లా అల్వాల్ టెలికాం కాలనీలో దారుణ ఘటన జరిగింది. వర్షానికి విద్యుత్ వైర్లపై చెట్టు పడిపోవడంతో సమీపంలో ఉన్నకారును తరలించేందుకు వెళ్లిన తండ్రి,కూతురికి కరెంట్ షాక్ తగిలింది.

ఘటనలో సందీప్ (45),రితిక (16) అక్కడికక్కడే మృతి చెందారు .ఒకే కుటుంబంలో ఇద్దరు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు విషాదంలో మునిగారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# బడి బోనమెత్తిన మాజీ సర్పంచ్

## -ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలని వినూత్న ప్రచారం
## - ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులను అభ్యర్థించిన భీమగాని రాములు మాధవి
## - ప్రభుత్వ పాఠశాలలో చేరే విద్యార్థులకు పారితోషికం ప్రకటన

భారత శక్తి, జూన్ 15 (యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి):యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం పెద్ద కందుకూరు గ్రామంలో మాజీ సర్పంచ్ భీమగాని రాములు మాధవి ఆధ్వర్యంలో సోమవారం వినూత్నంగా బడి బోనం కార్యక్రమం నిర్వహించారు. డప్పు చప్పుళ్ల మధ్య బోనం ఎత్తుకొని గ్రామంలోని గడపగడపకు తిరుగుతూ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని కోరుతూ బడి బోనం కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా దుస్తులు, మధ్యాహ్న భోజనం, పాఠ్యపుస్తకాలతో పాటు అన్ని రకాల సౌకర్యాలు అందుబాటులోఇ ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వ



పాఠశాలలో నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులకు బోధిస్తారని, పాఠశాలలో ల్యాబ్, లైబ్రరీ సదుపాయాలు కూడా ఉన్నట్లు తెలిపారు. ప్రైవేటు పాఠశాలలకు వెళ్లకుండా ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేరిపించాలని తల్లిదండ్రులను కోరారు. ప్రభుత్వ పాఠశాలలో చేరే విద్యార్థినీ విద్యార్థులకు 5000 రూపాయల ఆర్థిక సహాయాన్ని అందిస్తామని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెట్రోల్ డీజిల్ ఖర్చు తగ్గించుకోవాలని కోరుతున్నారని దీంతో పాటుగా ప్రైవేటు పాఠశాలల్లో చేర్పించకుండా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తే కూడా లక్షలాది రూపాయలు తల్లిదండ్రులకు మిగులుతాయని అన్నారు. ఈ సందర్భంగా పెద్ద కందుకూరు ప్రభుత్వ పాఠశాలలో చదివి మండల స్థాయిలో మూడవ ర్యాంకు సాధించిన బూడిద శశాంక్ ను శాలువాతో సన్మానించి 5000 రూపాయలు ప్రోత్సాహకం అందించారు. బడి బోనం కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తున్న మాజీ సర్పంచ్ భీమగాని రాములు మాధవిగౌడ్ లను పలువురు గ్రామస్తులు అభినందించారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు మురళీకృష్ణ, విద్యా కమిటీ చైర్మన్ గుండ్లపల్లి శారద ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు కాల్నె స్రవంతి రాజు, జాగిల్లపురం వనజ వెంకటేష్, స్వామి రామచందర్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఓట్ల తొలగింపు కుట్రలను అడ్డుకోవాలి మంత్రి అడ్లూరి
# బూత్ లెవల్ పోలింగ్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలి

జగిత్యాల, జూన్ 15 (భారత శక్తి ప్రతినిధి):



కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఓటర్ల జాబితాల నుంచి ఓట్లను తొలగించి అధికారంలోకి రావడానికి కుట్రలు చేస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆరోపించారు. ధర్మపురిలో సోమవారం నిర్వహించిన బూత్ లెవల్ పోలింగ్ ఏజెంట్ల శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ధర్మపురి నియోజకవర్గంలో 269 పోలింగ్ బూతులు, 2.37 లక్షల మంది ఓటర్లు ఉన్నారని మంత్రి తెలిపారు. ప్రతి అర్హుడి ఓటు నమోదయ్యేలా బూత్ లెవల్ పోలింగ్ ఏజెంట్లు పనిచేయాలని సూచించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి ఓటర్లకు అవగాహన కల్పించాలని కోరారు. మాజీ మంత్రులు జీవన్ రెడ్డి, కొప్పుల ఈశ్వర్ చేస్తున్న ఆరోపణలను ఖండించిన మంత్రి, వడ్ల కొనుగోలు లేదా ఇసుక రవాణాలో తాను అవినీతికి పాల్పడినట్లు నిరూపిస్తే రాజీనామా చేస్తానని సవాల్ విసిరారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కట్టుబడి పనిచేస్తానని స్పష్టం చేశారు. ఏఐసీసీ జనరల్ సెక్రటరీ రుద్ర సంతోష్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఓటును కాపాడాల్సిన బాధ్యత బూత్ లెవల్ పోలింగ్ ఏజెంట్లపై ఉందన్నారు. ఓటర్లకు అవసరమైన పత్రాలపై అవగాహన కల్పించి ఓటు హక్కు పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నందయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంఘనభట్ల దినేష్, మున్సిపల్ చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుముల లావణ్య లక్ష్మణ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


# ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పరిశీలించి వెంటనే పరిష్కరించాలి : జిల్లా కలెక్టర్

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) జూన్ 15 : కామారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు.

ఈ సందర్భంగా మొత్తం 93 దరఖాస్తులు వచ్చాయని భూ సమస్యలు, సంక్షేమ పథకాలు, పెన్షన్లు, ఉపాధి, గృహాలు, రెవెన్యూ , ఇతర శాఖలకు సంబంధించిన వినతులు ప్రజలు సమర్పించారు.

అందిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల మేరకు త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లు విక్టర్, ఎన్ వి



గిరి, జడ్ పి సిఈఓ చందర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# సైనిక దుస్తుల్లో వలసపాలన గుర్తులు అవుట్ - ఆర్మీ యూనిఫాంలో 'స్వదేశీ' మార్పులు

న్యూఢిల్లీ, భారత శక్తి ప్రతినిధి ,జూన్ 15:

బ్రిటిష్ కాలం నాటి పాత పద్ధతులకు ముగింపు పలుకుతూ, భారత సైన్యం తన యూనిఫాం నిబంధనలలో కీలక మార్పులు చేసింది. రివ్యూయింగ్ అధికారులు కచ్చితంగా కత్తులు (ఖడ్గాలు) పట్టుకోవాలనే రూల్‌ను పూర్తిగా ఎత్తేసింది. కొన్ని రకాల మెస్ దుస్తులతో పాటు పౌచ్ బెల్టులు వేసుకునే విధానాన్ని కూడా రద్దు చేసింది. గతంలో వాడిన 'రాయల్' లాంటి వలసపాలన పదాల వాడకాన్ని పూర్తిగా బంద్ పెట్టింది. మన దేశ సార్వభౌమత్వానికి ప్రతీకగా సివిల్ ఫార్మల్ దుస్తుల స్థానంలో స్వదేశీ బండీ జాకెట్‌ను ఆర్మీ తీసుకొచ్చింది. ఈ వివరాలన్నింటినీ తాజాగా విడుదల చేసిన 'ఆర్మీ యూనిఫామ్స్- 2026' గైడ్‌లైన్స్‌లో స్పష్టంగా పేర్కొంది.




# తాడిచెట్టు పై నుండి పడి గీత కార్మికుడు మృతి.

రేగొండ,మే,15 (భారత శక్తి ): జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండల కేంద్రంలో కల్లుగీత కార్మికుడు సోమవారం ఉదయం కల్లుగీస్తుండగా కిందపడి మృతి చెందిన సంఘటన రేగొండలో సోమవారం వెలుగు చూసింది. వివరాలలోకి వెళితే రేగొండ మండల కేంద్రం సంబంధించిన గండి సదయ్య (55), తన వృత్తిలో భాగంగా సోమవారం ఉదయం తాడిచెట్టు ఎక్కి కళ్ళు గీస్తుండగా అదుపుతప్పి కింద పడిపోయాడు.దీంతో వ్యక్తికి తీవ్ర గాయాలు అవడంతో అక్కడికక్కడే మరణించినట్లు స్థానికులు పేర్కొన్నారు.



# ఘనంగా 130వ డివిజన్ ఉపాధ్యక్షులు దొడ్ల నాగేశ్వర్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు



కుత్బుల్లాపూర్, జూన్ 15(భారత శక్తి ):

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 130వ డివిజన్ ఉపాధ్యక్షులు దొడ్ల నాగేశ్వర్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు పొందారు . ఈ సందర్భంగా హన్మంతన్న దొడ్ల నాగేశ్వర్ రెడ్డి ని శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలియజేశారు. వారి ప్రజాసేవా ప్రస్థానం మరింత విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో డీసీసీ జనరల్ సెక్రటరీ సోమన్నగారి శ్రీధర్ రెడ్డి, డీసీసీ కార్యనిర్వాహక సభ్యులు కరణ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు హరికిరణ్ పటేల్, నరసింహ గౌడ్, రామచందర్, చందు, రాజు చారి, ఎండి గఫ్ఫార్ తదితరులు పాల్గొన్నారు.

# బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే కార్యక్రమం.

## -గ్రీవెన్స్ డే కార్యక్రమంలో 24 ఫిర్యాదులు స్వీకరణ:జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే

రాజన్న సిరిసిల్ల, జూన్ 15(భారత శక్తి ):



ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు. సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 24 ఫిర్యాదులు స్వీకరించి, ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ...ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.


# అర్జీలు సకాలంలో పరిష్కరించాలి: అదనపు కలెక్టర్ గడ్డం నగేష్

## -సోమవారం ప్రజావాణికి 205 దరఖాస్తుల రాక.

భారత శక్తి న్యూస్,రాజన్న సిరిసిల్ల, జూన్ 15:

ప్రజావాణి అర్జీలు సకాలంలో పరిష్కరించాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు. జిల్లా సిరిసిల్ల సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం ప్రజావాణి నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి, త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు.

మొత్తం దరఖాస్తులు 205 వచ్చాయి. ఐడీఓసీ ప్రజావాణిలో డీఆర్ఓ జయశ్రీ, హౌసింగ్ పీడీ వెంకట మాధవరావు తదితరులు పాల్గొన్నారు.



# దోనూరులో 'అమ్మ మాట అంగన్‌వాడీ బాట' కార్యక్రమం

జగిత్యాల, జూన్ 15 (భారత శక్తి ప్రతినిధి):

జైన సెక్టార్ పరిధిలోని దోనూరు సెంటర్‌లో సోమవారం "అమ్మ మాట -- అంగన్‌వాడీ బాట" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ పర్యవేక్షకురాలు సరస్వతి, అంగన్‌వాడీ టీచర్ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్న సేవలు, పౌష్టికాహారం, ఆరోగ్య పరిరక్షణ చర్యల గురించి వివరించారు. రెండున్నర సంవత్సరాల నుంచి ఐదు సంవత్సరాల వయస్సు గల పిల్లలకు ప్రాథమిక విద్యతో పాటు పోషకాహారం అందిస్తున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల సేవలను ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చిన్నారుల శారీరక, మానసిక వికాసానికి అంగన్‌వాడీ కేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ మహిళలు పాల్గొని అంగన్‌వాడీ సేవలపై అవగాహన




పొందారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎన్‌టీఏ నిర్లక్ష్యం

## - నీట్ రీ-ఎగ్జామ్ హాల్ టికెట్ల డౌన్‌లోడ్‌లో సాంకేతిక లోపాలు
## -అభ్యర్థుల తీవ్ర అవస్థలు
## - జూన్ 14న విడుదలైన హాల్ టికెట్లు
## -జూన్ 21న నీట్ రీ-ఎగ్జామ్

న్యూఢిల్లీ, భారత శక్తి ప్రతినిధి, జూన్ 15: నీట్ రీ-ఎగ్జామ్ హాల్ టికెట్ల డౌన్‌లోడ్‌లో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలపై నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (టీూా) స్పందించింది. హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకునే సమయంలో అభ్యర్థులు పడుతున్న ఇబ్బందులు తమ దృష్టికి వచ్చాయని స్పష్టం చేసింది.

సాంకేతిక కారణాల వల్ల అభ్యర్థులకు కలిగిన అసౌకర్యానికి ఎన్‌టీఏ విచారం వ్యక్తం చేసింది. ఈ సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని, అభ్యర్థులందరికీ వీలైనంత త్వరగా అడ్మిట్ కార్డులు అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని అధికారులు వెల్లడించారు. అభ్యర్థులు




ఎలాంటి ఆందోళన చెందవద్దని ఎన్‌టీఏ ఈ సందర్భంగా భరోసా ఇచ్చింది.

# కాంగ్రెస్ పార్టీ అవినీతి కారణంగానే సింగరేణి సంస్థ నష్టపోతోంది

## -- తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం కల
## -- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత

మంచిర్యాల ప్రతినిధి, జూన్ 15 (భారతశక్తి):తెలంగాణనే కొట్లాడి తెచ్చుకున్నాం మంచిర్యాల ఎమ్మెల్యే గుండా గిరికి భయపడతమా అని తెలంగాణ రక్షణ సేన పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు.బాయ్ బాట కార్యక్రమంలో భాగంగా సోమవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో టిఆర్ఎస్ చీఫ్ కవిత ప్రెస్ మీట్ నిర్వహించారు.ఈ సందర్భంగా కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ ఈ గడ్డ నుంచి తెలంగాణ రక్షణ పార్టీ ఏర్పాటయిందని ఇక్కడి నుంచే జెండా ఎగరవేస్తామని కవిత తెలిపారు. మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు గుండాగిరి బంద్ చేయాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అవినీతి కారణంగానే సింగరేణి సంస్థ నష్టపోతుందని, సింగరేణి హక్కులను కాపాడేది హెచ్ఎంఎస్ టిఆర్ఎస్ మాత్రమే అని అన్నారు.సింగరేణి బొగ్గు మాయం వెనక ఉన్న నిజాలను తేల్చేందుకు ప్రభుత్వం వెంటనే శ్వేత పత్రం విడుదల చేయాలని కవిత డిమాండ్ చేశారు. జిఎం చేసే పనులు, సీఎం క్లర్క్ చేసే పనులను డిప్యూటీ సీఎం చేస్తున్నారూ అని అన్నారు.కార్మికులను తీవ్రంగా ఇబ్బంది పెడుతూ సంస్థను ప్రైవేటుపరం చేసే కుట్ర జరుగుతుందని, కేంద్రం తెచ్చిన నాలుగు లేబర్ కార్డులను వ్యతిరేకిస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం వాటికి వ్యతిరేకంగా తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఈ భూమి పుత్రుడు అయితే సింగరేణికి మేలు చేయాలన్నారు.మంచిర్యాల నుంచి బొగ్గు భాయ్ యాత్ర ప్రారంభించుకోవడం ఆనందంగా ఉందన్నారు.తెలంగాణలో మేము ఒక ప్రాంతీయ పార్టీగా రక్షణ సేనను ప్రారంభించామన్నారు. సింగరేణిలో చాలామంది కార్మికులను తగ్గించే కుట్ర చేస్తున్నారన్నారు.సింగరేణిలో కార్మికుల కనీస సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. గుజరాత్ లోని గుజరాత్



మినరల్స్ అనే కార్పొరేషన్ ఉంది. మైనింగ్ మెంబర్స్ అన్ని దాని ద్వారా నడుస్తున్నాయన్నారు. ఈ విధానాన్ని కార్పొరేషన్ ద్వారా ఏర్పాటు చేయాలన్నారు .మేము అధికారంలోకి వచ్చిన తర్వాత గుజరాత్ మాదిరిగానే కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామన్నారు.సింగరేణి మైనింగ్ డెవలప్మెంట్ విధానాన్ని తెస్తే అండర్ గ్రౌండ్ మైనింగ్ కూడా చేసుకోవచ్చని తెలిపారు.బొగ్గ కుంభకోణాన్ని సాకుగా చూపి అధికారంలోకి వచ్చాక 250 బ్లాకు ను జాతీయం చేసిందన్నారు.తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం కల అని ఎద్దేవా చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకోవాల్సిన నాలుగు లేబర్ కోట్ల చట్టాలను మేము వ్యతిరేకిస్తున్నామని అన్నారు . మంచిర్యాల ఎమ్మెల్యే సింగరేణిలో చేస్తున్న అవినీతిని త్వరలో బయటపెడతామని అన్నారు. కాంటాక్ట్ కార్మికులకు న్యాయం చేయాలని పెద్దపెల్లి ఎంపి ని డిమాండ్ చేస్తున్నామన్నారు. సింగరేణి ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే కార్మికులకు ఎలాంటి న్యాయం చేయలేదని కల్వకుంట్ల కవిత ఆరోపించారు.

# మళ్లీ బడి బాట పట్టిన విద్యార్థులందరికీ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు

హైదరాబాద్, భారత శక్తి ప్రతినిధి, జూన్ 15:

వేసవి సెలవుల అనంతరం మళ్లీ బడి బాట పట్టిన విద్యార్థులందరికీ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. పాఠశాలలు ప్రారంభమైన నేపథ్యంలో ముఖ్యమంత్రి విద్యార్థినీ విద్యార్థులకు, అధ్యాపకులకు అభినందనలు తెలిపారు.

"పాఠశాల అనేది కేవలం చదువులు నేర్చుకునే స్థలం మాత్రమే కాదు. మన వ్యక్తిత్వాన్ని, దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే ఆలయం. ప్రతి పుస్తకం ఒక కొత్త ప్రపంచానికి తలుపు లాంటిది. ప్రతి పాఠం ఒక కొత్త అవకాశానికి మార్గం. విద్య మన భవిష్యత్తుకు వెలుగు నింపే శక్తి.

తరగతి గదుల్లోనే దేశ భవిష్యత్తు ఉందని విశ్వసిస్తాను. అందుకే అత్యున్నత ప్రమాణాలతో విద్యారంగం విలసిల్లాలని అనేక సంస్కరణలు చేపట్టాం. ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం వంటి పోషకాలతో కూడిన ఆహారం అందించడమే కాకుండా అనేక చర్యలు చేపట్టాం.

ప్రతి రోజును ఉత్సాహంతో ప్రారంభించి, గురువుల మార్గదర్శకత్వంలో జ్ఞానాన్ని సంపాదించండి. కష్టపడి చదవండి. మంచి విలువలను అలవర్చుకోండి. మీ కలలను నిజం చేసుకునేందుకు నిరంతరం శ్రమించండి.

నేటి విద్యార్థులే రేపటి భారతదేశ నిర్మాతలు. మీలోని ప్రతిభను వెలికితీసి, కుటుంబానికి, సమాజానికి, రాష్ట్రానికి, దేశానికి గర్వకారణంగా నిలవాలి.

"విద్యే గొప్ప సంపద -- దానిని ఎవరూ దోచుకోలేరు. విద్యతోనే విజయం, విద్యతోనే వికాసం." ఈ విద్యా సంవత్సరం మీ అందరికీ జ్ఞానం, ఆనందం, విజయాలను అందించాలని ఆకాంక్షిస్తూ... అందరికీ శుభారంభం -- ఆనందంగా బడికి వెళ్లండి, ఆసక్తిగా నేర్చుకోండి, ఉన్నత లక్ష్యాలను సాధించండి" అని ముఖ్యమంత్రి ఒక సందేశంలో పేర్కొన్నారు.

# గంభీరావుపేట బస్టాండ్, మార్కెట్ ప్రాంతంలో డాగ్ స్క్వాడ్ తనిఖీలు.

భారత శక్తి న్యూస్, రాజన్న సిరిసిల్ల, జూన్ 14:

గంభీరావుపేట బస్టాండ్, మార్కెట్ ప్రాంతంలో గంభీరావుపేట ఎస్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలో డాగ్ స్క్వాడ్ బృందం విస్తృత తనిఖీలు నిర్వహించింది. పలు పాన్ షాపులు, రద్దీ ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టి అనుమానాస్పద వస్తువుల కోసం పరిశీలించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్సై సూచించారు.




# గంజాయి అక్రమ రవాణా చేస్తున్న వ్యక్తి అరెస్ట్

## -- 145 గ్రాముల గంజాయి,సెల్‌ఫోన్ స్వాధీనం

మంచిర్యాల ప్రతినిధి, జూన్ 15 (భారతశక్తి):

మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఇందారం క్రాస్‌రోడ్డు వద్ద నమ్మదగిన సమాచారం మేరకు గంజాయి అక్రమ రవాణా చేస్తున్న వ్యక్తిని జైపూర్ పోలీసులు అరెస్ట్ చేసి,అతని వద్ద నుంచి గంజాయి, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.ఆదివారం మధ్యాహ్నం అందిన నమ్మదగిన సమాచారం మేరకు జైపూర్ సీఐ నవీన్ ఆదేశాల ప్రకారం, జైపూర్ ఎస్ఐ భూమేష్ తన సిబ్బందితో కలిసి ఇందారం క్రాస్‌రోడ్డు వద్ద తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా పోలీసులను గమనించిన ఓ వ్యక్తి అక్కడి నుంచి పారిపోవడానికి ప్రయత్నించగా అనుమానం వచ్చి అతడిని అదుపులోకి తీసుకుని విచారించారు.విచారణలో అతడు షేక్ ఆఫ్రీద్ (23), ఎస్‌టీకాలనీ,జైపూర్ నివాసిగా గుర్తించారు. నిందితుడు కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నానని,అధిక డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో మహారాష్ట్ర రాష్ట్రంలోని చంద్రపూర్ ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తుల వద్ద తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి, జైపూర్ పరిసర ప్రాంతాల్లో అధిక ధరకు విక్రయిస్తున్నానని ఒప్పుకున్నాడు.నిందితుడి వద్ద ఉన్న బ్యాగును పంచుల సమక్షంలో తనిఖీ చేయగా,ఒక ప్యాకెట్‌లో ఎండబెట్టిన గంజాయి లభించింది.తూకం వేయగా 145 గ్రాముల గంజాయి ఉన్నట్లు నిర్ధారణ అయింది. అలాగే గంజాయి కొనుగోలు,




విక్రయాలకు ఉపయోగిస్తున్నట్లు తెలిపిన రియల్‌మీ 6 ప్రో మొబైల్ ఫోన్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు.స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.3,500గా అంచనా వేశారు. గంజాయి ప్యాకెట్, పాలిథీన్ కవర్, మొబైల్ ఫోన్‌ను సీజ్ చేశారు.అనంతరం నిందితుడిని,స్వాధీనం చేసుకున్న ఆస్తులను పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు తెలిపారు.నిందితుడిని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్ఐ భూమేష్ పోలీసు సిబ్బందిని ఏసీపీ అభినందించారు.

# జయవరం వద్ద రోడ్డు ప్రమాదం.. రేకుర్తి యువకుడు అక్కడికక్కడే మృతి

భారత శక్తి న్యూస్, వేములవాడ, జూన్ 15:

వేములవాడ పట్టణ శివారులోని జయవరం వద్ద సోమవారం మధ్యాహ్నం జరిగిన ఒక ఘోర రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. కరీంనగర్ సమీపంలోని రేకుర్తి గ్రామానికి చెందిన దానే రమేశ్ (30) తాపీ మేస్త్రీగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం మధ్యాహ్నం వేములవాడ శివారులోని జయవరం వద్ద అతను ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని, ఎదురుగా వచ్చిన టాటా ఏస్ వాహనం బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన రమేశ్ ఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయాడు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

# కుబీర్ మండలం చాత గ్రామంలో కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమం

## "ప్రతి గ్రామం -- ప్రతి పౌరుడు...నేర నివారణలో భాగస్వామి కావాలి"లి -- పోలీసులు.

నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 15(భారత శక్తి ):ఎస్పీ డా.జి.జానకి షర్మిల దిశానిర్దేశాల మేరకు ఈరోజు భైంసా సబ్ డివిజన్ లోని కుబీర్ మండలం చాత గ్రామంలో కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో భాగంగా అనుమతులు లేకుండా నడుపుతున్న (92) ద్విచక్రవాహనాలు,ఒక ఆటోను స్వాధీనం చేసుకొని, సంబంధిత నిబంధనల ప్రకారం జరిమానాలు విధించడమైనది.ఈ సందర్భంగా భైంసా ఏఎస్పీ సాయి కిరణ్ మాట్లాడుతూ సైబర్ నేరాలు, ట్రాఫిక్ సమస్యలు,నిషేధిత మత్తు పదార్థాల వినియోగం, మొబైల్ డ్రైవింగ్,మద్యం సేవించి వాహనాలు నడపడం, మైనర్ల చేత వాహనాల నడపడం వంటి సామాజిక మలినతలపై విపులంగా వివరణనిచ్చారు.అలాగే ఆస్తి సంబంధ నేరాల నివారణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకం అని స్పష్టంగా తెలియజేశారు.ఈ కార్యక్రమంలో భైంసా ఏఎస్పీ సాయి కిరణ్, భైంసా రూరల్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, కుబీర్ ఎస్ఐ కృష్ణ రెడ్డి, కుంటాల ఎస్ఐ అశోక్,పోలీస్ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

# పదవీ విరమణ పొందిన హోంగార్డ్ ను సత్కరించిన జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల,

నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 15 (భారత శక్తి ): హోంగార్డ్ ఆర్గనైజేషన్లో ఎన్నో ఏళ్లుగా పనిచేస్తూ ఎనలేని సేవలందించి నేడు పదవీ విరమణ పొందిన ఇందాల్ సింగ్ హోంగార్డును ఈ రోజు జిల్లా పోలీసు కార్యాలయంలో, జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల, ఘనంగా సత్కరించారు.37 సంవత్సరాలు హోంగార్డ్ ఆర్గనైజేషన్ లో సేవలను అందించి ఈరోజు పదవీ విరమణ పొందిన హోంగార్డ్ ను జిల్లా ఎస్పీ శాలువాలతో, పూలమాలతో ఘనంగా సత్కరించారు. వీరి అనుభవాలను జిల్లా ఎస్పీతో పంచుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూపదవీ విరమణ పొందిన అనంతరం అశేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో కలసి ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. పదవీ విరమణ పొందిన తర్వాత ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.దైనందిన కార్యక్రమాలలో భాగంగా వ్యాయామం,యోగా,ధ్యానం వంటి వాటిని అనుసరిస్తూ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు



ఈ సన్మాన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల, అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఉపేందర్ రెడ్డి, ఏ.ఓ యూనస్ అలీ, ఆర్.ఐ రామ్ నిరంజన్ రావ్ పాల్గొన్నారు.

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Published at D.No. 42-4-61/A2,Bhavani Residency,FFB,2nd Lane , Ramarajuvari veedi, Ramakrishnapuram, Vijayawada - 520011, Andhra Pradesh,Printed at Sri Muktheswara Publications, D.No. 29-23-11, Thadepalli Vari Veedi, Surya Rao Peta, Vijayawada - 520002, Andhra Pradesh. Fax: 040-24054446, Cell:9440265569
Email: bharathasakti@gmail.com, RNI APTEL/2010/36743, Editor: Kesaram Penta Reddy